RNI : TGMUL/25/A1386

# తొలి అక్షరం

మా అక్షరమే - మీ అయుధంగా...

చైర్మన్& చీఫ్ ఎడిటర్ పస్తం సైదులు

www.tholiaksharam.com

ఎడిటర్: పి.సైదులు, సంపుటి : 03 సంచిక - 255 పేజీలు - 08 సోమవారం 10 ఆగస్టు 2026

## తొలి పలుకు

అతి తక్కువ కాలంలో అన్ని వర్గాల్లో విశేష ఆదరణ పొందుతున్న తొలి అక్షరం దినపత్రిక నిష్పక్షపాత విశ్వసనీత సమాచారంతో డిజిటల్ రంగంలో అగ్రస్థానంలోకి అడుగుపెడుతున్న తరుణంలో పాఠక మహాశయుల ఆదరాభిమానం మన్నల్ని పొందుతూ దూసుకుపోతున్న తొలి అక్షరం తెలుగు దినపత్రిక సూర్యోదయంతో పాటే పాఠకుల ముందుకు వస్తూ రాష్ట్రస్థాయిలో దేశస్థాయిలో ప్రపంచ స్థాయిలోని సమాజంలోని అన్ని రంగాల్లోని సంబంధిత అంశాలపై సమాచార వ్యాప్తిలో ముందుంటుంది. ఎప్పటికప్పుడు సమాచారాన్ని ముందు ఉంచడంలో తొలి అక్షరం దినపత్రిక అనేక మంది పాఠకుల ఆధార అభిమానాలు పొందుతుండడం విశేషంగా భావిస్తూ.. ఇదేవిధంగా పాఠకులు ఆదరాభిమానాలు ఇలాగే కొనసాగాలని ఆశిస్తూ....

- పి.సైదులు ఎడిటర్ తొలి అక్షరం దినపత్రిక



# గిరిజన అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం

## అంతర్జాతీయ ఆదివాసీ దినోత్సవం

- విజయవాడలో కార్యక్రమం... హాజరైన సీఎం చంద్రబాబు
- ప్రతి ఒక్కరూ వ్యక్తిగత బాధ్యత తీసుకోవాలని సీఎం పిలుపు
- జీవో నెంబర్ 3ను చట్టపరంగా కాపాడతామని ఆదివాసులకు భరోసా
- అరకు కాఫీ తరహాలో స్థానిక గిరిజన ఉత్పత్తులకు గ్లోబల్ బ్రాండింగ్

**తొలి అక్షరం/అమరావతిఆగస్టు 9:** అంతర్జాతీయ ఆదివాసీ దినోత్సవం వేదికగా ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు ఒక స్ఫూర్తిదాయక ప్రసంగం చేశారు. దేశభక్తి అంటే కేవలం సరిహద్దుల్లో పోరాడటం మాత్రమే కాదని, ప్రతి పౌరుడు తన వృత్తిలో విజయం సాధించి, సమాజానికి సేవ చేయడమే నిజమైన దేశభక్తి అని ఉద్బోధించారు. ప్రతి ఒక్కరూ తమకంటూ ఒక లక్ష్యాన్ని నిర్దేశించుకుని, దేశాభివృద్ధిలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఆదివాసీ దినోత్సవం సందర్భంగా విజయవాడ అంబేద్కర్ కళావేదికలో జరిగిన సభకు చంద్రబాబు ముఖ్య


మిగతా 2లో.



### స్వాతంత్ర్య పోరాటానికి 'క్విట్ ఇండియా'

# కొత్త శక్తినిచ్చింది

- క్విట్ ఇండియా ఉద్యమం స్వాతంత్ర్య పోరాటానికి కొత్త ఊపునిచ్చిందన్న ప్రధాని
- ఉద్యమకారుల ధైర్యసాహసాలు, త్యాగాలు తరతరాలకు స్ఫూర్తిదాయకమని వ్యాఖ్య
- 'డూ ఆర్ డై' సంకల్పాన్ని దేశప్రజల్లో నింపిందని గుర్తు చేసుకున్న అమిత్ షా
- ఉద్యమకారులకు నివాళులర్పించిన ప్రధాని, కేంద్ర హోంమంత్రి, యూపీ సీఎం



**తొలి అక్షరం/ఢిల్లీ ఆగస్టు 9:** చారిత్రాత్మక క్విట్ ఇండియా ఉద్యమం స్వాతంత్ర్య సంగ్రామానికి కొత్త శక్తిని అందించిందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. ఈ ఉద్యమ వార్షికోత్సవం సందర్భంగా ఆదివారం ఆయన స్వాతంత్ర్య సమరయోధులకు ఘనంగా నివాళులర్పించారు. వారి ధైర్యసాహసాలు, త్యాగాలు రాబోయే తరాలకు ఎల్లప్పుడూ స్ఫూర్తినిస్తూనే ఉంటాయని ప్రధాని పేర్కొన్నారు.ఆగస్టు విప్లవంలో పాల్గొన్న నేతలను, సమరయోధులను స్మరించుకుంటూ ప్రధాని మోదీ 'ఎక్స్'లో ఒక పోస్ట్ చేశారు. "మహాత్మా గాంధీ నాయకత్వ స్ఫూర్తితో ప్రారంభమైన క్విట్ ఇండియా ఉద్యమం

మిగతా 2లో.

# మమతా బెనర్జీ కారుపై రాళ్ల దాడి

- మృతి చెందిన కార్యకర్త కుటుంబాన్ని పరామర్శించేందుకు వెళ్లగా ఘటన
- పోలీసుల సమక్షంలోనే దాడి జరిగిందని మమత ఆరోపణ
- దాడిని ఖండించిన బీజేపీ, తమకు సంబంధం లేదని వెల్లడి
- మరణాన్ని రాజకీయం చేస్తున్నారంటూ మమతపై సువేందు అధికారి విమర్శ



**తొలి అక్షరం/కోల్‌కతా ఆగస్టు 9:** పశ్చిమ బెంగాల్‌లో రాజకీయాలు మరోసారి వేడెక్కాయి. మాజీ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ప్రయాణిస్తున్న కారుపై నిరసనకారులు దాడికి పాల్పడ్డారు. కోల్‌కతా సమీపంలోని ఉత్తర 24 పరగణాల జిల్లా హాలిసహర్‌లో ఈ ఘటన తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. ఆమె కాన్వాయ్‌పై కొందరు రాళ్లు, ఇటుకలు, వాటర్ బాటిళ్లు విసిరారు.

మిగతా 2లో.

### పెద్ది సుదర్శన్‌రెడ్డి కుటుంబానికి

# కేసీఆర్ పరామర్శ..



- రూ.2.25 కోట్ల ఆర్థిక సాయం అందజేత
- నల్లబెల్లిలో దివంగత ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి దశదినకర్మ
- హాజరై కుటుంబ సభ్యులను పరామర్శించిన కేసీఆర్
- రూ.2.25 కోట్ల ఆర్థిక సాయం చెక్కులు అందజేత
- సుదర్శన్‌రెడ్డితో అనుబంధాన్ని గుర్తుచేసుకుని భావోద్వేగం
- పార్టీ అండగా ఉంటుందని కుటుంబానికి భరోసా

**తొలి అక్షరం/నర్సంపేట ఆగస్టు 9:** బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ వరంగల్ జిల్లా నల్లబెల్లిలో పర్యటించారు. ఇటీవల అనారోగ్యంతో కన్నుమూసిన నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి దశదినకర్మ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా సుదర్శన్‌రెడ్డి కుటుంబసభ్యులను పరామర్శించి, వారికి పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. పార్టీ ప్రకటించిన రూ.2.25 కోట్ల ఆర్థిక సాయానికి సంబంధించిన చెక్కులను కేసీఆర్ స్వయంగా

మిగతా 2లో.

### రాజమండ్రి ఘటనలో గాయపడిన

# ప్రియాంక మృతి

- సికింద్రాబాద్ కిమ్స్ ఆసుపత్రిలో తుదిశ్వాస విడిచిన వైనం
- మరణాన్ని ధ్రువీకరించిన వైద్యులు
- ప్రమాదానికి కారణమైన ఇద్దరు నిందితులు ఇప్పటికే అరెస్ట్



**తొలి అక్షరం/హైదరాబాద్ ఆగస్టు 9:** రాజమండ్రిలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన మెడికో ప్రియాంక మృత్యువుతో పోరాడి ఓడిపోయింది. గత ఐదు రోజులుగా సికింద్రాబాద్‌లోని కిమ్స్ ఆస్పత్రిలో వెంటిలేటర్‌పై చికిత్స పొందుతూ ఆమె శుక్రవారం తుదిశ్వాస విడిచింది. ఓ వైద్యురాలిగా ఎంతో భవిష్యత్తు ఉన్న ప్రియాంక అర్ధాంతరంగా తనువు చాలించడంతో ఆమె కుటుంబంలో తీవ్ర

మిగతా 2లో.

# క్షేత్రస్థాయిలో పర్యటించాలి

- మంత్రులకు లోకేశ్ కీలక ఆదేశాలు
- 14 రోజుల్లో 40 లక్షల కుటుంబాలను కలిసిన టీడీపీ శ్రేణులు
- కూటమి ప్రభుత్వ రెండేళ్ల పాలనపై ప్రజలకు వివరణ




2లో.

# బస్సులారీ ఢీ..

## 35 మందికి గాయాలు!

- పామిడి మండలంలో ఘోర రోడ్డు ప్రమాదం
- ఇద్దరు డ్రైవర్లకు తీవ్ర గాయాలు.. 15 మంది పరిస్థితి విషమం
- బ్రిడ్జిపై నుంచి కిందకు పడిన వాహనాలు



2లో.

# నేటితో సర్ ఆఖరు

- హైదరాబాద్‌లో 40 లక్షల ఓట్లు గల్లంతు?.. ఓటర్ల జాబితా సర్వేతో భారీ మార్పులు!
- సుమారు 40 లక్షల ఓట్లు జాబితా నుంచి తొలగింపు అంచనా
- సొంతూరిలో ఓటు హక్కుకే వలసదారుల మొగ్గు
- సనత్‌నగర్‌లో అత్యధికంగా 45శాతం ఓట్ల రద్దుకు అవకాశం
- ఆగస్టు 17న విడుదల కానున్న ముసాయిదా ఓటర్ల జాబితా




2లో.

# గిరిజన అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం

**మొదటిపేజీ తరువాయి**

అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన ప్రసంగిస్తూ... గిరిజన సమాజానికి సమగ్ర అభివృద్ధి, సంక్షేమంపై పలు కీలక హామీలు ఇస్తూ, వారి హక్కులను కాపాడేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని భరోసా ఇచ్చారు.

సాధారణ ఆదివాసీ కుటుంబంలో పుట్టి, అనేక కష్టాలను అధిగమించి, దేశ ప్రథమ పౌరురాలిగా అత్యున్నత శిఖరాలను అధిరోహించిన రాష్ట్రపతి ద్రౌపది ముర్ము జీవితం ప్రతి ఒక్కరికీ ఆదర్శమని చంద్రబాబు అన్నారు. ఆమె స్ఫూర్తితో గిరిజన యువత ఉన్నత లక్ష్యాలను ఏర్పరచుకోవాలని సూచించారు. జాతీయ జెండాతో పాటు మీ అజెండా కూడా ఉండాలని పిలుపునిచ్చారు.

“సంకల్పం బలంగా ఉంటే ఏదైనా సాధించవచ్చు. ద్రౌపది ముర్ము, అబ్దుల్ కలాం, బీఆర్ అంబేద్కర్, ఎన్టీఆర్, నరేంద్ర మోదీ వంటి మహనీయులంతా సాధారణ కుటుంబాల నుంచి వచ్చినవారే. ‘నేను ఏంటి? ఎలా ఎదగాలి? ఈ సమాజానికి, దేశానికి నేనేం ఇవ్వాలి?’ అనే లక్ష్యంతో పనిచేయాలి. మీ విజయం దేశ విజయమవుతుంది..“ అని ఆయన పేర్కొన్నారు. ఈ స్ఫూర్తిని వ్యాపింపజేసేందుకు ఆగస్టు 9 నుంచి 15 వరకు ‘అనే నేను‘ పేరుతో ఒక ఉద్యమంలా ముందుకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు.



### గిరిజన ఉత్పత్తులకు గ్లోబల్ బ్రాండింగ్.. అరకు కాఫీ ఒక సక్సెస్ స్టోరీ

గిరిజన ప్రాంతాల్లోని ఆర్థిక స్వావలంబనపై చంద్రబాబు ప్రత్యేకంగా దృష్టి సారించారు. తాను 25 ఏళ్ల క్రితం ఒక చిరు ప్రయత్నంగా ప్రారంభించిన అరకు కాఫీ, నేడు ప్రపంచవ్యాప్తంగా ప్రఖ్యాతి గాంచడాన్ని ఆయన గుర్తుచేశారు. “అరకు కాఫీకి నేనే పేరు పెట్టాను. దానిని మార్కెటింగ్ చేసి, ప్రధాని నరేంద్ర మోదీ నుంచి ఆస్ట్రేలియా ప్రధాని వరకు బహుకరించి, గ్లోబల్ బ్రాండ్‌గా నిలబెట్టాను. ఇవాళ పారిస్‌లో కూడా అరకు కాఫీ స్టాళ్లు ఉన్నాయి“ అని గర్వంగా ప్రకటించారు.

ఇదే స్ఫూర్తితో సీతంపేట పసుపు, రంపచోడవరం రబ్బర్, పార్వతీపురం పైనాపిల్, తేనె, తాటిబెల్లం వంటి స్థానిక ఉత్పత్తులకు విలువ జోడించి, బ్రాండింగ్ చేసి, మార్కెటింగ్ చేసే బాధ్యతను ప్రభుత్వమే తీసుకుంటుందని హామీ ఇచ్చారు. గిరిజన ప్రాంతాల్లోని రైతులు పండించే ప్రతి పంటకు గిట్టుబాటు ధర కల్పించి, వారిని ఆర్థికంగా బలోపేతం చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా వివిధ సంస్థలతో 19 అవగాహన ఒప్పందాలు (ఎంఓయూ) కుదుర్చుకున్నట్లు వెల్లడించారు.

**మౌలిక వసతులు, విద్య, వైద్యానికి పెద్దపీట**

గిరిజన ప్రాంతాల సమగ్రాభివృద్ధికి నాలుగు కీలక రంగాలపై దృష్టి పెడుతున్నట్లు ముఖ్యమంత్రి ప్రకటించారు. మౌలిక సదుపాయాలు, విద్య, వైద్యం, ఆదాయ మార్గాల పెంపునకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు.

మౌలిక వసతులు: డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఆధ్వర్యంలో 2,336 గిరిజన ఆవాసాలకు మిషన్ మోడ్‌లో రోడ్ కనెక్టివిటీ కల్పిస్తామన్నారు. ‘జల్ జీవన్ మిషన్‘ కింద 2027 డిసెంబర్ నాటికి ప్రతి గిరిజన ఇంటికి కుళాయి ద్వారా సురక్షిత నీటిని అందిస్తామని హామీ ఇచ్చారు. మారుమూల గ్రామాలకు సైతం టెలికాం కనెక్టివిటీ అందించి, డోలీ మోతలు లేని సమాజాన్ని నిర్మిస్తామన్నారు.

విద్య: ‘తల్లికి వందనం‘ కింద 4.92 లక్షల మంది గిరిజన విద్యార్థులకు రూ.650 కోట్లు అందించామని, ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యకు పెద్దపీట వేస్తున్నామని తెలిపారు. విశాఖలోని మేకవారిపాలెంలో 600 మంది విద్యార్థులతో ‘సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‘ ఏర్పాటు చేసి, ఐఐటీ వంటి జాతీయ పరీక్షలకు ప్రత్యేక శిక్షణ ఇస్తున్నట్లు చెప్పారు. ఏటా కనీసం 100 మంది గిరిజన విద్యార్థులు జాతీయ స్థాయి సంస్థల్లో సీట్లు సాధించడమే లక్ష్యమన్నారు.

వైద్యం: పాడేరులో మెడికల్ కాలేజీతో పాటు పార్వతీపురం, రంపచోడవరం, శ్రీశైలం వంటి ప్రాంతాల్లో మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రులు నిర్మిస్తామన్నారు. ‘సంజీవిని‘ ప్రాజెక్ట్ ద్వారా ప్రతి ఒక్కరి ఆరోగ్య వివరాలను డిజిటలైజ్ చేస్తామని, సికిల్ సెల్ అనీమియా బాధితులకు రూ.10,000 పింఛను అందిస్తూ, వ్యాధి నిర్మూలనకు కృషి చేస్తామని ప్రకటించారు.

**జీవో నెంబర్ 3 పరిరక్షణకు కట్టుబడి ఉన్నాం**

గిరిజన ప్రాంతాల్లో ఉద్యోగాలు స్థానికులకే దక్కాలనే ఆశయంతో ఎన్టీఆర్ హయాంలో పురుడుపోసుకుని, తాను 2000 సంవత్సరంలో తీసుకొచ్చిన జీవో నెంబర్ 3ను కాపాడతామని చంద్రబాబు స్పష్టమైన హామీ ఇచ్చారు. సుప్రీంకోర్టులో ఈ జీవోను కొట్టివేయడానికి గత ప్రభుత్వ వైఫల్యమే కారణమని విమర్శించారు. “ఈ జీవోను చట్టపరంగా, రాజ్యాంగబద్ధంగా నిలబడేలా పటిష్టమైన కార్యాచరణ రూపొందిస్తాం. ఆదివాసుల హక్కుల పరిరక్షణకు ఈ ప్రభుత్వం కట్టుబడి ఉంది. ఆవేశంతో కాకుండా ఆలోచనతో, అందరి అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని దీనిపై ముందుకు వెళతాం“ అని భరోసా ఇచ్చారు.

గిరిజన ప్రాంతాలను కేవలం వెనుకబడిన ప్రాంతాలుగా కాకుండా, అపార అవకాశాలున్న ప్రాంతాలుగా చూస్తున్నామని, అక్కడి పచ్చదనం, స్వచ్ఛమైన వాతావరణాన్ని ఉపయోగించుకుని టూరిజం హబ్‌లుగా తీర్చిదిద్దుతామని అన్నారు. ప్రతి గిరిజన ఇల్లు ‘అతిథి గృహం‘గా మారాలని, తద్వారా ప్రపంచానికి ఆతిథ్యం ఇవ్వాలని ఆకాంక్షించారు. ప్రతి ఒక్కరూ ఒక చెట్టు నాటి, దానిని సంరక్షించడం ద్వారా పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. 2047 నాటికి ‘వికసిత్ భారత్‘, ‘స్వర్ణాంధ్రప్రదేశ్‘ లక్ష్యాలను సాధించడంలో ఆదివాసీలు కీలక పాత్ర పోషించాలని, వారి సర్వతోముఖాభివృద్ధికి ప్రభుత్వం అండగా ఉంటుందని ముఖ్యమంత్రి చంద్రబాబు పునరుద్ఘాటించారు.

# రాజమండ్రి ఘటనలో గాయపడిన ప్రియాంక మృతి

**మొదటిపేజీ తరువాయి**

వివరాల్లోకి వెళితే, ఆగస్టు 3వ తేదీన తూర్పుగోదావరి జిల్లా రాజమండ్రిలోని ప్రసాదిత్యమాల్ ప్రాంతంలో ప్రియాంక తన స్కూటర్‌పై వెళుతుండగా ఈ దుర్ఘటన జరిగింది. మద్యం మత్తులో అతివేగంగా కారు నడిపిన సురవరపు దశ్వంత్, ఆండ్రూ జోసెఫ్ ఎడ్వర్డ్స్ అనే ఇద్దరు యువకులు ఆమె స్కూటర్‌ను ఉద్దేశపూర్వకంగా మూడుసార్లు ఢీకొట్టారు. ఈ ఘటనలో ప్రియాంక తలకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే ఆమెను రాజమండ్రిలోని స్థానిక ఆస్పత్రికి తరలించగా, పరిస్థితి విషమించడంతో మెరుగైన వైద్యం కోసం కుటుంబసభ్యులు హైదరాబాద్‌లోని కిమ్స్‌కు తరలించారు.

అక్కడ ఆమెను కాపాడేందుకు వైద్యులు తీవ్రంగా శ్రమించారు. అయినప్పటికీ ఆమె కోలుకోలేకపోయింది. శుక్రవారం మధ్యాహ్నం 3:25 గంటలకు ప్రియాంక తుదిశ్వాస విడిచినట్టు కిమ్స్ వైద్యులు ప్రకటించారు.

ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు, నిందితులు దశ్వంత్, ఆండ్రూలను ఇప్పటికే అరెస్ట్ చేశారు. వారిని కోర్టులో హాజరుపరచగా, న్యాయస్థానం 14 రోజుల రిమాండ్ విధించడంతో జైలుకు తరలించారు.

కాగా, తన కుమార్తె మృతికి కారణమైన వారిపై సాధారణ ప్రమాద కేసు కాకుండా, హత్య కేసు నమోదు చేయాలని ప్రియాంక తండ్రి డిమాండ్ చేశారు. ఇది కేవలం ప్రమాదం కాదని, ఉద్దేశపూర్వకంగా చేసిన హత్యేనని ఆయన ఆరోపిస్తున్నారు. పోలీసులు కూడా సీసీటీవీ ఫుటేజి పరిశీలించిన అనంతరం, కావాలనే ఢీకొట్టినట్టు గుర్తించారు. హత్యాయత్నం సెక్షన్లతో కేసును మరింత పకడ్బందీగా మార్చారు. ప్రియాంక స్వస్థలం తెలంగాణలోని గద్వాల జిల్లా అయిజ మండలం ఎక్లాస్ పూర్. ఆమె ఎంబీబీఎస్ అనంతరం రాజమండ్రిలో పీజీ చేస్తోంది. ఇప్పుడు ఆమె మృతితో స్వగ్రామంలో తీవ్ర విషాదం నెలకొంది.

### మెడికో ప్రియాంక కుటుంబానికి రూ.20 లక్షల సాయం ప్రకటించిన సీఎం చంద్రబాబు

రాజమండ్రిలో కారు ఢీకొట్టిన ఘటనలో మృతి చెందిన వైద్య విద్యార్థిని ప్రియాంక కుటుంబానికి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు రూ. 20 లక్షల ఆర్థిక సహాయం ప్రకటించారు. ఆమె మరణ వార్త తనను తీవ్రంగా కలచివేసిందని, ఈ ఘటన అత్యంత విషాదకరమని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం జిల్లా అధికారులతో నిర్వహించిన టెలీకాన్ఫరెన్స్‌లో ఆయన ఈ మేరకు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ.. ప్రియాంక కుటుంబానికి ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. బాధిత కుటుంబానికి తక్షణమే రూ. 20 లక్షల సహాయం అందించాలని అధికారులను ఆదేశించారు. ఈ ఘటనపై తాను ఇప్పటికే జిల్లా అధికారులతో సమీక్షించానని గుర్తుచేశారు. ప్రమాదానికి కారణమైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, వారికి కఠిన శిక్ష పడేలా చూడాలని స్పష్టం చేశారు. ఈ కేసులో నిందితులను ఇప్పటికే అరెస్ట్ చేసి జైలుకు పంపినట్టు తూర్పుగోదావరి జిల్లా ఎస్పీ నరసింహ కిశోర్ వివరించారు. దీనిపై స్పందించిన సీఎం, నిర్లక్ష్యంగా వ్యవహరించి ఒక నిండు ప్రాణాన్ని బలిగొన్న వారికి కఠిన శిక్ష పడేలా బలమైన సెక్షన్లు నమోదు చేయాలని సూచించారు.

# బస్సులారీ ఢీ.. 35 మందికి గాయాలు!

**పామిడి మండలంలో ఘోర రోడ్డు ప్రమాదం**

**ఇద్దరు డ్రైవర్లకు తీవ్ర గాయాలు.. 15 మంది పరిస్థితి విషమం**


**బ్రిడ్జిపై నుంచి కిందకు పడిన వాహనాలు**

**తొలి అక్షరం/పామిడి, ఆగస్టు 9:**

పామిడి మండలంలోని పొగరూరు గ్రామ సమీపంలో 44వ జాతీయ రహదారిపై ఆదివారం వేకువజామున ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. ప్రైవేట్ బస్సు, ఐచర్ లారీ ఢీకొనడంతో అదుపుతప్పి బ్రిడ్జిపై నుంచి కిందకు పడిపోయాయి. ఈ ప్రమాదంలో బస్సులో ప్రయాణిస్తున్న 35 మంది ప్రయాణికులు గాయపడగా.. వారిలో 15 మంది పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. హైదరాబాద్ నుంచి బెంగళూరుకు సుమారు 35 మంది ప్రయాణికులతో వెళ్తున్న ప్రైవేట్ బస్సు ఆదివారం తెల్లవారుజామున 4 గంటల సమయంలో పొగరూరు సమీపంలోని 44వ జాతీయ రహదారిపైకి చేరుకుంది. అదే సమయంలో వచ్చిన ఐచర్ లారీని బస్సు ఢీకొట్టింది. దీంతో రెండు వాహనాలు అదుపుతప్పి బ్రిడ్జిపై నుంచి కిందకు పడిపోయాయి. ప్రమాదం జరిగిన వెంటనే బస్సులోని ప్రయాణికులు భయాందోళనకు గురై కేకలు వేయడంతో పరిసర ప్రాంతాల్లో కలకలం రేగింది.

**క్షతగాత్రులను ఆసుపత్రికి తరలింపు**

సమాచారం అందుకున్న పోలీసులు హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకున్నారు. స్థానికుల సహకారంతో బస్సులో చిక్కుకున్న క్షతగాత్రులను బయటకు తీసి పామిడి ప్రభుత్వ ఆసుపత్రికి



తరలించారు. మొత్తం 35 మంది ప్రయాణికులకు చికిత్స అందించగా.. 15 మంది పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం జిల్లా కేంద్రంలోని సర్వజన ఆసుపత్రికి తరలించినట్లు తెలిసింది.

**క్యాబిన్‌లో చిక్కుకున్న డ్రైవర్లు**

ప్రమాద తీవ్రతకు రెండు వాహనాల క్యాబిన్లు పూర్తిగా దెబ్బతిన్నాయి. ఇద్దరు డ్రైవర్లు క్యాబిన్లలో ఇరుక్కుపోవడంతో పోలీసులు, సహాయక సిబ్బంది గ్యాస్ కట్టర్ల సాయంతో వాహన భాగాలను తొలగించి వారిని బయటకు తీశారు. తీవ్రంగా గాయపడిన ఇద్దరు డ్రైవర్లను కూడా మెరుగైన చికిత్స కోసం జిల్లా కేంద్రంలోని సర్వజన ఆసుపత్రికి తరలించారు.

**నిద్రమత్తే కారణమా?**

అతివేగంగా ప్రయాణించడం, డ్రైవర్లు నిద్రమత్తులోకి వెళ్లడం వల్లే ప్రమాదం జరిగి ఉండవచ్చని ప్రాథమికంగా తెలుస్తోంది. అయితే ప్రమాదానికి అసలు కారణాలపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. అదృష్టవశాత్తూ ప్రమాదంలో ఎవరూ మృతి చెందలేదని, క్షతగాత్రులందరికీ వైద్య చికిత్స అందుతున్నట్లు సమాచారం.

# స్వాతంత్ర్య పోరాటానికి ‘క్విట్ ఇండియా‘ కొత్త శక్తినిచ్చింది

**మొదటిపేజీ తరువాయి**

మన స్వాతంత్ర్య పోరాటానికి నూతన ఉత్తేజాన్ని ఇచ్చింది. వలస పాలన నుంచి విముక్తి పొందాలన్న మన ప్రజల అచంచల సంకల్పాన్ని ఇది ప్రతిబింబించింది. ఈ ఉద్యమంలో పాల్గొన్న వారందరినీ స్మరించుకుంటున్నాను. వారి ధైర్యం ప్రతి భారతీయుడికి ఎప్పటికీ స్ఫూర్తిదాయకమే“ అని మోదీ తన సందేశంలో తెలిపారు. కేంద్ర హోంమంత్రి అమిత్ షా కూడా క్విట్ ఇండియా ఉద్యమకారులకు నివాళులర్పించారు. ఈ ఉద్యమం దేశప్రజలందరినీ ఏకతాటిపైకి తెచ్చిందని, ‘డూ ఆర్ డై‘ (చేయండి లేదా చావండి) అనే సంకల్పాన్ని, అద్వితీయమైన ధైర్యాన్ని వారిలో నింపిందని ఆయన గుర్తు చేసుకున్నారు. జాతి ప్రయోజనాలకు ప్రథమ స్థానం ఇస్తూ, స్వదేశీని ప్రోత్సహిస్తూ ఆత్మనిర్భర్, వికసిత భారత్ లక్ష్యాల కోసం పనిచేయడానికి ఈ రోజు స్ఫూర్తినివ్వాలని ఆయన పిలుపునిచ్చారు. ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ సైతం ఉద్యమకారుల ధైర్యాన్ని, త్యాగాలను స్మరించుకున్నారు. ‘డూ ఆర్ డై‘ నినాదంతో సమరయోధులు జాతీయ చైతన్యాన్ని రగిలించి స్వాతంత్ర్య పోరాటానికి ఒక నిర్ణయాత్మక దిశను చూపారని ఆయన పేర్కొన్నారు. 1942 ఆగస్టు 8న బొంబాయిలో అఖిల భారత కాంగ్రెస్ కమిటీ ‘క్విట్ ఇండియా‘ తీర్మానాన్ని ఆమోదించిన తర్వాత ఈ ఉద్యమం ప్రారంభమైంది. అప్పుడు మహాత్మా గాంధీ ‘డూ ఆర్ డై‘ అనే చారిత్రాత్మక పిలుపునిచ్చారు. బ్రిటిష్ పాలన అంతం కావాలని డిమాండ్ చేశారు. బ్రిటిష్ ప్రభుత్వం కఠినంగా అణిచివేసినప్పటికీ, దేశవ్యాప్తంగా నిరసనలు, సమ్మెలు వెల్లువెత్తాయి. భారత స్వాతంత్ర్య పోరాట తుది దశలో ఇది ఒక మహోద్యమంగా నిలిచింది.

# పెద్ది సుదర్శన్‌రెడ్డి కుటుంబానికి కేసీఆర్ పరామర్శ..

**మొదటిపేజీ తరువాయి**



సుదర్శన్ రెడ్డి కుటుంబ సభ్యులకు అందజేశారు. నల్లబెల్లిలోని నివాసానికి చేరుకున్న కేసీఆర్, తొలుత సుదర్శన్‌రెడ్డి చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం ఆయన కుటుంబ సభ్యులతో మాట్లాడారు. సుదర్శన్‌రెడ్డితో తనకున్న అనుబంధాన్ని గుర్తుచేసుకుని కేసీఆర్ తీవ్ర భావోద్వేగానికి లోనయ్యారు. సుదర్శన్‌రెడ్డి అత్యంత సాదాసీదా జీవితం గడిపారని, తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన మంచి నేత అని కొనియాడారు. ఆయన మరణం పార్టీకి తీరని లోటని విచారం వ్యక్తం చేశారు.

బీఆర్ఎస్ పార్టీ తరఫున ప్రకటించిన ఆర్థిక సాయంలో భాగంగా సుదర్శన్‌రెడ్డి ఇద్దరు పిల్లల పేరున చెరో రూ.1 కోటి, ఆయన తల్లి అమృతమ్మ సంరక్షణ కోసం రూ.25 లక్షల చెక్కులను కేసీఆర్ అందించారు. పిల్లల చదువులు, భవిష్యత్తుతో పాటు కుటుంబ సంక్షేమ బాధ్యతలను పార్టీ నిరంతరం పర్యవేక్షిస్తుందని స్పష్టం చేశారు. కుటుంబానికి అన్ని విధాలా అండగా నిలుస్తామని హామీ ఇచ్చారు.

కేసీఆర్ రాక సందర్భంగా నల్లబెల్లికి బీఆర్ఎస్ శ్రేణులు, నాయకులు, అభిమానులు భారీగా తరలివచ్చారు. పెద్ది సుదర్శన్‌రెడ్డి నివాసం వద్ద జనం కిక్కిరిసిపోవడంతో స్వల్ప తోపులాట చోటుచేసుకుంది. దీంతో పోలీసులు రంగప్రవేశం చేసి, పరిస్థితిని అదుపులోకి తెచ్చి కేసీఆర్ కాన్వాయ్‌కు దారి కల్పించారు. కేసీఆర్ వెంట పలువురు పార్టీ సీనియర్ నాయకులు, ప్రజాప్రతినిధులు ఉన్నారు.

# మమతా బెనర్జీ కారుపై రాళ్ల దాడి

**మొదటిపేజీ తరువాయి**

పోలీసు కస్టడీలో మరణించినట్లు భావిస్తున్న తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) కార్యకర్త బిర్జూ కియోట్ కుటుంబాన్ని పరామర్శించేందుకు మమతా బెనర్జీ వెళుతుండగా ఈ సంఘటన చోటుచేసుకుంది. దోపిడీ ఆరోపణలపై అరెస్టయిన బిర్జూ, పోలీసుల కస్టడీలో మరణించాడు. ఈ నేపథ్యంలో, మమత పర్యటనను వ్యతిరేకిస్తూ స్థానికులు పెద్ద ఎత్తున నిరసనకు దిగారు. ఆమె కారును చుట్టుముట్టి, దానిపై బురద పూశారు. “చోర్ భగావో“ (దొంగను తరిమేయండి) అంటూ నినాదాలు చేశారు.

ఈ దాడిపై మమతా బెనర్జీ తీవ్రంగా స్పందించారు. పోలీసుల సమక్షంలోనే గుర్తుతెలియని వ్యక్తులు తన వాహనంపై రాళ్లతో దాడి చేశారని ఆమె ఆరోపించారు. “కారు అద్దాలు మూసి ఉండటంతో ప్రాణాలతో బయటపడ్డాను. లేదంటే ఆ రాళ్లు తలకు తగిలి నా తల పగిలిపోయేది“ అని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. పోలీసులు ప్రేక్షకపాత్ర వహించారని, వారు కేవలం అధికార బీజేపీకి మాత్రమే రక్షణ కల్పిస్తున్నారని మండిపడ్డారు. ఆమెతో పాటు ఉన్న లోక్‌సభ ఎంపీ కల్యాణ్ బెనర్జీ, రాజ్యసభ ఎంపీ డోలా సేన్ కూడా అధికారుల వైఫల్యాన్ని విమర్శించారు. ఈ ఘటనను రాష్ట్ర బీజేపీ చీఫ్ సమీక్ భట్టాచార్య ఖండించారు. ఈ దాడితో తమ పార్టీకి ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేశారు. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన పోలీసులను డిమాండ్ చేశారు. అయితే, సీఎం సువేందు అధికారి దీన్ని మమత సృష్టించిన డ్రామాగా అభివర్ణించారు. కస్టడీ మరణాన్ని రాజకీయం చేసేందుకే మమత బలవంతంగా ఆ ప్రాంతానికి వెళ్లారని ఆరోపించారు. మృతుడి కుటుంబ సభ్యులు అధికారుల తీరుపై సంతృప్తి చెందారని, మరణానికి కచ్చితమైన కారణం తెలియాలని మాత్రమే వారు కోరుకుంటున్నారని తెలిపారు. తన పర్యటనతో మమత ప్రజా జీవితానికి ఆటంకం కలిగించారని విమర్శించారు.

ఇటీవలే మమత మేనల్లుడు అభిషేక్ బెనర్జీపై కూడా ఆయన నియోజకవర్గంలో దాడి జరిగిన నేపథ్యంలో, తాజా ఘటనతో రాష్ట్రంలో రాజకీయ ఉద్రిక్తతలు మరింత పెరిగాయి

# నేటితో సర్ ఆఖరు

**తొలి అక్షరం/హైదరాబాద్ ఆగస్టు 9:**

రాజధాని హైదరాబాద్ నగరంలో ఓటర్ల సంఖ్యలో భారీ మార్పులు చోటుచేసుకోబోతున్నాయి. ప్రస్తుతం జరుగుతున్న ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సర్వే (ా×=) కారణంగా గ్రేటర్ పరిధిలో ఏకంగా 40 లక్షల ఓట్లు జాబితా నుంచి తొలగిపోయే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. రేపటితో ఈ సర్వే కార్యక్రమం ముగియనుండగా, నిన్నటి వరకు ఉన్న సమాచారం ప్రకారం రాజధానిలోని మూడు జిల్లాల పరిధిలో ఉన్న 28 అసెంబ్లీ నియోజకవర్గాల్లో మొత్తం 1.14 కోట్ల మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో దాదాపు మూడో వంతు ఓట్లు రద్దయ్యే సూచనలు కనిపిస్తుండటం తీవ్ర చర్చనీయాంశంగా మారింది.

ప్రభుత్వ సెలవులు ఉన్నప్పటికీ ఆది, సోమవారాల్లో బూత్ స్థాయి అధికారుల (బీఎల్ఓ) నుంచి ఉన్నతాధికారుల వరకు విధుల్లోనే ఉంటారని జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్ స్పష్టం చేశారు. ఇప్పటివరకు ఎన్యుమరేషన్ ఫారాలను సమర్పించని ఓటర్లు ఎవరైనా ఉంటే వెంటనే అందజేయాలని ఆయన సూచించారు. క్షేత్రస్థాయిలో సర్వే పూర్తి చేసి, ఈ నెల 17న ముసాయిదా ఓటరు జాబితాను ప్రకటించేందుకు అధికారులు వేగంగా ఏర్పాట్లు చేస్తున్నారు.

**సనత్‌నగర్‌లో సగానికి పైగా ఓట్లు రద్దు!**

ఓట్ల తొలగింపు ప్రభావం దాదాపు అన్ని నియోజకవర్గాల్లో ఉన్నప్పటికీ, కొన్ని ప్రాంతాల్లో ఇది అత్యధికంగా ఉంది. ముఖ్యంగా సనత్‌నగర్ నియోజకవర్గంలో మొత్తం 2,54,030 ఓట్లు ఉండగా, వాటిలో ఏకంగా 1.16 లక్షల ఓట్లు (45.68%) రద్దయ్యే అవకాశం ఉందని అంచనా. అదేవిధంగా జూబ్లీహిల్స్‌లో 44.21%, ఎల్బీనగర్‌లో 42.19%, ఉప్పల్‌లో 40.05%, మహేశ్వరంలో 40.03% ఓట్లు జాబితా నుంచి తొలగిపోవచ్చని అధికారులు చెబుతున్నారు. అత్యల్పంగా ఇబ్రహీంపట్నంలో 21.43% ఓట్లు రద్దయ్యే అవకాశం ఉంది. రాబోయే రెండు రోజుల్లో ఈ సంఖ్యల్లో స్వల్ప మార్పులు మాత్రమే ఉండొచ్చని భావిస్తున్నారు.

**ఓట్ల తొలగింపునకు కారణాలేంటి?**

దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి ఉపాధి, ఇతర అవసరాల కోసం ప్రతిరోజూ వేలాది మంది హైదరాబాద్‌కు వలస వస్తుంటారు. ఇక్కడే స్థిరపడి ఓటరుగా నమోదు చేసుకుంటారు. అయితే, ప్రస్తుతం దేశవ్యాప్తంగా ఓటరు సర్వే జరుగుతున్న నేపథ్యంలో.. సొంత ఊరితో పాటు హైదరాబాద్‌లోనూ ఓటు హక్కు ఉన్నవారు తమ ఓటును సొంతూరిలోనే కొనసాగించేందుకు ప్రాధాన్యం ఇస్తున్నారు. దీంతో నగరంలో ఎన్యుమరేషన్ ఫారాలను చాలామంది అధికారులకు తిరిగి ఇవ్వలేదని తెలుస్తోంది. ఇదే ఓట్ల సంఖ్య భారీగా తగ్గడానికి ప్రధాన కారణంగా కనిపిస్తోంది.

మరోవైపు కొందరు అధికారుల నిర్లక్ష్యం కారణంగా తమకు ఇప్పటికీ ఎన్యుమరేషన్ ఫారాలు అందలేదని లక్షలాది మంది ఓటర్లు ఆరోపిస్తున్నారు. ఇలాంటి వారంతా ఆన్‌లైన్ ద్వారా తమ వివరాలను నమోదు చేసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. సోమవారం గడువు ముగిసిన తర్వాత తుది లెక్కలు తేలనుండగా, ఆగస్టు 17న వెలువడనున్న ముసాయిదా జాబితాపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది.

# క్షేత్రస్థాయిలో పర్యటించాలి

**మంత్రులకు లోకేశ్ కీలక ఆదేశాలు**

**తొలి అక్షరం/అమరావతిఆగస్టు 9:**

తెలుగుదేశం పార్టీ ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ‘ఇంటింటికీ తెలుగుదేశం 2 ఏళ్ల నమ్మకం‘ కార్యక్రమం విజయవంతంగా కొనసాగుతోంది. కూటమి ప్రభుత్వ రెండేళ్ల పాలనలో సాధించిన ప్రగతిని, సంక్షేమ ఫలాలను ప్రజలకు నేరుగా వివరించే ఈ కార్యక్రమం ఆదివారం నాటికి 14వ రోజుకు చేరుకుంది. గడిచిన 14 రోజుల్లో రాష్ట్రవ్యాప్తంగా పార్టీ శ్రేణులు 40.74 లక్షలకు పైగా కుటుంబాలను నేరుగా కలుసుకుని రికార్డు సృష్టించాయి. కూటమి ప్రభుత్వ పాలనపై ప్రజల నుంచి వస్తున్న అపూర్వ స్పందనతో ఈ కార్యక్రమం పండుగ వాతావరణంలో సాగుతోంది. ఇందులో భాగంగా ఆదివారం ఒక్కరోజే రాష్ట్రవ్యాప్తంగా 3.53 లక్షల ఇళ్లను టీడీపీ నాయకులు, కార్యకర్తలు సందర్శించారు. ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన ‘సూపర్ సిక్స్‘ హామీల అమలు తీరును, ఇతర సంక్షేమ పథకాల ద్వారా పేదలకు అందుతున్న ప్రయోజనాలను ప్రతి కుటుంబానికి వివరిస్తున్నారు. ఈ కార్యక్రమ పురోగతిపై టీడీపీ వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేశ్ ప్రత్యేక దృష్టి సారించారు. కార్యక్రమాన్ని మరింత సమర్థవంతంగా క్షేత్రస్థాయిలోకి తీసుకెళ్లేందుకు ఆయన పార్టీ శ్రేణులకు కీలక ఆదేశాలు జారీ చేశారు. ముఖ్యంగా, జిల్లాల ఇన్‌ఛార్జ్ మంత్రులు తమకు కేటాయించిన ప్రాంతాల్లో తప్పనిసరిగా పర్యటించాలని, ప్రజలతో మమేకమై ప్రభుత్వ విజయాలను వివరించాలని స్పష్టం చేశారు. క్లస్టర్, మండల స్థాయి నాయకులను ఫోకస్ బూత్‌లకు అనుసంధానించి, సమన్వయంతో పనిచేయాలని దిశానిర్దేశం చేశారు. మంత్రులు, ఎమ్మెల్యేల నుంచి గ్రామ స్థాయి కార్యకర్తల వరకు ప్రతి ఒక్కరూ ఈ కార్యక్రమంలో సమష్టిగా పాల్గొంటున్నారని, ప్రజల నుంచి అద్భుతమైన స్పందన వస్తోందని పార్టీ వర్గాలు తెలిపాయి. ఈ కార్యక్రమం ద్వారా ప్రభుత్వంపై ప్రజల్లో ఉన్న నమ్మకాన్ని మరింత పటిష్ఠం చేయాలని టీడీపీ భావిస్తోంది.

# మల్లఖంబ్‌తో విద్యార్థుల్లో శారీరక, మానసిక వికాసం

**ముఖ్య అతిథులుగా తెలంగాణ రాష్ట్ర వ్యాయామ ఉపాధ్యాయ సంఘం కార్యదర్శి కృష్ణమూర్తి**

**తెలంగాణ రాష్ట్ర మున్సిపల్ ఛాంబర్ మాజీ అధ్యక్షులు వెన్ రెడ్డి రాజు**




**తొలి అక్షరం/చౌటుప్పల్, ఆగస్టు 09:** చౌటుప్పల్ మున్సిపాలిటీ పరిధిలోని ట్రినిటీ హైస్కూల్‌లో నిర్వహించిన తెలంగాణ రాష్ట్రస్థాయి మల్లఖంబ్ శిక్షణ శిబిరం రెండో రోజు ముగింపు సమావేశం ఆదివారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్ర వ్యాయామ ఉపాధ్యాయ సంఘం కార్యదర్శి కృష్ణమూర్తి, తెలంగాణ రాష్ట్ర మున్సిపల్ ఛాంబర్ మాజీ అధ్యక్షులు వెన్‌రెడ్డి రాజు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. రెండు రోజులపాటు శిక్షణ పొందిన శిక్షకులకు వారు సర్టిఫికెట్లను అందజేశారు. ఈ సందర్భంగా వెన్‌రెడ్డి రాజు మాట్లాడుతూ.. మల్లఖంబ్ మన దేశానికి చెందిన ప్రాచీన క్రీడ అని, ఈ శిక్షణను పాఠశాల విద్యార్థులకు అందించడం ద్వారా ఈ సంప్రదాయ క్రీడను భావితరాలకు అందించిన వారిగా శిక్షకుల జీవితం సార్థకమవుతుందని అన్నారు. విద్యార్థులు మల్లఖంబ్ నేర్చుకోవడం ద్వారా శారీరక దారుఢ్యంతో పాటు మానసిక ఉల్లాసాన్ని పొందుతారని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం గుర్తించిన జీవో 74లో మల్లఖంబ్ క్రీడకు ఇంకా స్థానం కల్పించలేదని, ఈ ప్రాచీన క్రీడకు రాష్ట్రస్థాయిలో గుర్తింపు లభించేలా కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్రంలోని అన్ని పాఠశాలల్లో మల్లఖంబ్ శిక్షణ అందుబాటులోకి తీసుకురావాలని, విద్యార్థులు ఈ క్రీడను నేర్చుకునేలా నైపుణ్యం కలిగిన శిక్షకులను తయారు చేయాలని సూచించారు. తెలంగాణలోని పాఠశాలల్లో మల్లఖంబ్‌ను విస్తృతంగా ప్రోత్సహించి, విద్యార్థుల్లో క్రమశిక్షణ, ఏకాగ్రత, శారీరక సామర్థ్యాన్ని పెంపొందించేందుకు కృషి చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ట్రినిటీ హైస్కూల్ చైర్మన్ కేవీబీ కృష్ణారావు, అసోసియేషన్ కోశాధికారి పోలే అంజయ్య, ఉపాధ్యక్షురాలు డాక్టర్ ఉజ్జిని మంజుల, కార్యదర్శి గోపాల్తో పాటు శిక్షణ పొందిన శిక్షకులు కిరణ్, వెంకట్, కృష్ణమూర్తి, నరేష్, సందీప్, స్వాతి, స్వరూప, సుమతి, అరుణ, నందిని, రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

# సూపర్ స్టార్ మహేష్ బాబు జన్మదిన వేడుకలు

**- ఊరుగొండ - దుర్గంపేటలో పేదలకు నిత్యవసరాలు, పండ్లు పంపిణీ**



**తొలి అక్షరం/రాష్ట్ర బ్యూరో తొర్రూర్ ప్రతినిధి (సాంబ పస్తం) ఆగస్టు 9:** సూపర్ స్టార్ మహేష్ బాబు జన్మదినాన్ని పురస్కరించుకుని జై కృష్ణ యువసేన నాయకులు, అభిమానులు సమాజసేవా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. జై కృష్ణ యువసేన జిల్లా ఉపాధ్యక్షులు కృష్ణ & మహేష్ బాబు మరియు దామెర మండల అధ్యక్షుడు గడ్డం కార్తీక్ నాయకత్వంలో గడ్డం వేణుగోపాల్ ఆధ్వర్యంలో ఊరుగొండ, దుర్గంపేట గ్రామాల్లోని పేద ప్రజలకు పండ్లు, పాలు, గుడ్లు మరియు బ్రెడ్ పంపిణీ చేశారు. ఈ సేవా కార్యక్రమానికి జై కృష్ణ యువసేన జిల్లా అధ్యక్షులు బొజ్జ భాను ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ:"సూపర్ స్టార్ మహేష్ బాబు కేవలం వెండితెరపైనే కాదు, నిజ జీవితంలోనూ 'రియల్ హీరో'. ఇప్పటివరకు 7,000 కంటే ఎక్కువ మంది చిన్న పిల్లలకు ఉచితంగా గుండె ఆపరేషన్లు చేయించి, వేలాది చిన్నారుల ప్రాణాలను కాపాడిన దైవ సమానులు మహేష్ బాబు. మహేష్ బాబు అభిమానులు, యువసేన నాయకులు భూక్యా లింగాన్న, ఆఖేలి సునిల్, కోల నవీన్, నూకల రవీందర్, గుజ్జేలి కరుణాకర్, నూకల కభాలి, కరక్కటం మురళి, రవి, మసన, సంతోష్ మరియు పెద్ద సంఖ్యలో అభిమానులు పాల్గొని కార్యక్రమాన్ని దిగ్విజయం చేశారు.

# హర్ ఘర్ తిరంగా యాత్రను విజయవంతం చేయాలి

**- ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కొలుపుల శంకర్**



**తొలి అక్షరం/రాష్ట్ర బ్యూరో తొర్రూర్ ప్రతినిధి (సాంబ పస్తం) ఆగస్టు 9:** భారత స్వాతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని నిర్వహించనున్న హర్ ఘర్ తిరంగా యాత్ర కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కొలుపుల శంకర్ పిలుపునిచ్చారు. తొర్రూర్ డివిజన్ కేంద్రంలో ఆదివారం తొర్రూరు అర్బన్ మండల శాఖ మండల అధ్యక్షుడు ఫైండ్ల రాజేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ స్వాతంత్ర సమరయోధుల త్యాగాలను స్మరించుకుంటూ ప్రతి ఇంటిపై జాతీయ జెండాను ఎగరవేసి దేశభక్తిని చాటాలని కోరారు. ఈ కార్యక్రమాన్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని సూచించారు. తిరంగ యాత్రలో యువత పెద్ద ఎత్తున పాల్గొనాలని, దేశ సమగ్రతను ఐక్యతను ఈ కార్యక్రమంలో పాల్గొని చాటి చెప్పాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైస్ ప్రెసిడెంట్ పల్లె కుమార్, మండల ప్రధాన కార్యదర్శి నడిగడ్డ సందీప్, ప్రోగ్రాం కన్వీనర్ నూకల నవీన్, జిల్లా నాయకులు అలిసేరి రవిబాబు, మంగళపల్లి యాకన్న, తూర్పాటి సాయి ముఖేష్, మహిళా మోర్చా అధ్యక్షురాలు దూకుంట్ల విజయ, కాగు నవీన్, సిహెచ్. విజయ్ కుమార్, జలగం రవి,గట్ల భరత్, సర్వి వెంకటేష్, తాడిశెట్టి జగదీష్, కొండపల్లి శీను, తూర్పాటి మోహిత్, కొండపల్లి గణేష్, వీరన్న,తూర్పాటి విగ్నేష్ పాల్గొన్నారు.

# స్థానిక యువతకు ఉద్యోగాల కోసం సీపీఐ పోరుబాట

**● ప్రజా చైతన్య యాత్రలో ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం**





**తొలి అక్షరం/చౌటుప్పల్, ఆగస్టు 09:** చౌటుప్పల్ ప్రాంతంలోని పరిశ్రమల్లో స్థానిక యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని సీపీఐ ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం డిమాండ్ చేశారు. సీపీఐ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రజా చైతన్య యాత్రలో భాగంగా ఆదివారం చౌటుప్పల్‌లో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. చౌటుప్పల్ పరిసర ప్రాంతాల్లో అనేక పరిశ్రమలు ఉన్నప్పటికీ స్థానిక యువతకు తగిన స్థాయిలో ఉపాధి అవకాశాలు కల్పించడం లేదని ఆయన ఆరోపించారు. పరిశ్రమల ఏర్పాటు కోసం వందలాది ఎకరాల వ్యవసాయ భూములు కోల్పోయిన స్థానిక ప్రజలు ఒకవైపు, పరిశ్రమల కాలుష్యంతో పంటలు, భూగర్భ జలాలు, తాగునీరు కలుషితమవుతున్న పరిస్థితులతో మరోవైపు నష్టపోతున్నారని అన్నారు. ఇన్ని విధాలుగా స్థానిక ప్రజలు నష్టపోతున్నప్పటికీ, అదే ప్రాంతానికి చెందిన నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు కల్పించడంలో పరిశ్రమల యాజమాన్యాలు ఎందుకు నిర్లక్ష్యం చేస్తున్నాయని ప్రశ్నించారు. కొన్ని పరిశ్రమలు కనీస భద్రతా ప్రమాణాలు, నిబంధనలు పాటించకుండా నిర్వహిస్తున్నాయని, పరిశ్రమల్లో ప్రమాదాలు జరిగినప్పుడు వాటిని బయటకు రాకుండా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయని అన్నారు. దీంతో కార్మికుల కుటుంబాలు తీవ్రంగా నష్టపోతున్నాయని పేర్కొన్నారు. పర్యావరణాన్ని పరిరక్షించాల్సిన కాలుష్య నియంత్రణ మండలి అధికారులు నామమాత్రపు తనిఖీలకే పరిమితమై పరిశ్రమల యాజమాన్యాలకు వత్తాసు పలుకుతున్నారని విమర్శించారు. ప్రభుత్వాలు వెంటనే జోక్యం చేసుకుని చౌటుప్పల్ ప్రాంతంలోని యువత అభిప్రాయాలను తీసుకుని స్థానికులకు ఉద్యోగ అవకాశాలు కల్పించేలా పరిశ్రమల యాజమాన్యాలపై ఒత్తిడి తీసుకురావాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో సీపీఐ ఆధ్వర్యంలో చౌటుప్పల్ పరిధిలోని అన్ని గ్రామాల యువతను సమీకరించి పరిశ్రమల ఎదుట ప్రత్యక్ష పోరాటాలకు సిద్ధమవుతామని హెచ్చరించారు. దేశవ్యాప్తంగా యువతలో పెరుగుతున్న అసంతృప్తి భవిష్యత్తులో పెద్ద ఉద్యమంగా రూపుదిద్దుకునే అవకాశం ఉందని నెల్లికంటి సత్యం అన్నారు. యువతను నిర్లక్ష్యం చేసే ప్రభుత్వాలు మనుగడ సాగించలేవని, ఉద్యోగాలు కల్పించకుండా పరిపాలన సాగిస్తే నేటి యువత గతంలో మాదిరిగా మౌనంగా ఉండబోదని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను తప్పకుండా అమలు చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయంతో పనిచేసి రోజురోజుకూ పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరలను నియంత్రించి పేద, మధ్యతరగతి ప్రజలకు ఉపశమనం కల్పించాలని కోరారు. చాలీచాలని వేతనాలతో దినసరి కూలీలు కుటుంబాలను పోషించలేని పరిస్థితి నెలకొందని, దీనిపై ప్రభుత్వాలు తక్షణమే దృష్టి సారించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పల్లె శేఖర్ రెడ్డి, బచ్చనగోని గాలయ్య, రాష్ట్ర అధ్యక్షులు కురిమిద్దె శ్రీనివాస్, జిల్లా సమితి సభ్యులు దుబ్బాక భాస్కర్, కలకొండ సంజీవ, చిలివేరు అంజయ్య, సూర్వి నర్సింహా, కొండూరి వెంకటేష్, బూడిగపాక జగన్, చలం పాండురంగరావు, ముత్యాల అంజయ్య, పిల్లి శంకరయ్య, ఉడుత రామలింగం, బద్దుల సుధాకర్, టంగుటూరు రాములు, రొండి నర్సింహా, దాసరి అంజయ్య, రోషణగారి అంజయ్య, గుడ్డేటి బిక్షపతి, కుంటి పాపయ్య, మనోహర్, , ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

# సూపర్ స్టార్ మహేష్ బాబు జన్మదిన వేడుకలు

**● వృద్ధాశ్రమంలో సేవా కార్యక్రమాలు ● పెద్దమ్మగడ్డ స్వయంకృషి ఆశ్రమంలో వృద్ధులకు అన్నదానం పండ్ల పంపిణీ ● 7 వేలకు పైగా చిన్నారులకు గుండె ఆపరేషన్లు చేయించిన రియల్ హీరో మహేష్ బాబు జిల్లా అధ్యక్షుడు బొజ్జ భాను**




**తొలి అక్షరం/రాష్ట్ర బ్యూరో తొర్రూర్ ప్రతినిధి (సాంబ పస్తం) ఆగస్టు 9:** సూపర్ స్టార్ మహేష్ బాబు జన్మదినాన్ని పురస్కరించుకుని పెద్దమ్మగడ్డలోని స్వయంకృషి వృద్ధాశ్రమంలో అభిమానులు ఘనంగా వేడుకలు నిర్వహించారు. వాడిచర్ల ప్రసాద్, ఉప్పుల అనిల్, కాలేరు బాలకృష్ణ, నితిన్ ల ఆధ్వర్యంలో ఆశ్రమంలోని వృద్ధులకు అన్నదానం చేపట్టి పండ్లు, పాలు, గుడ్లు, బ్రెడ్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా అధ్యక్షుడు బొజ్జ భాను హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... మహేష్ బాబు వెండితెరపైనే కాకుండా నిజ జీవితంలోనూ 'రియల్ హీరో' అని కొనియాడారు. ఇప్పటివరకు 7,000 మందికి పైగా చిన్నపిల్లలకు ఉచితంగా గుండె ఆపరేషన్లు చేయించి వారి ప్రాణాలు కాపాడిన మహానుభావుడని, వేలాది కుటుంబాల్లో వెలుగులు నింపిన దేవుడని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గౌరవ అధ్యక్షులు దేవర సమ్మయ్య, నాయకులు రాచర్ల శ్రీను, మంద రామకృష్ణ, భూక్యా లింగన్న, చిట్యాల బిక్షపతి, బత్తిన ప్రదీప్ గౌడ్, వాసం శివస్వరూప్, బదనపురం సంపత్, దాసరి రమేష్, అంబటిరాజు, అంబటి క్రాంతి, వాలుగుల్ల వరుణ్, బొజ్జ లక్కీ, కత్తి మహిపాల్, బొజ్జ మహేందర్ తో పాటు పెద్ద ఎత్తున మహేష్ బాబు అభిమానులు పాల్గొన్నారు.

# కోమిటి రెడ్డి సుశీలమ్మ ఫౌండేషన్ చైర్పర్సన్ లక్ష్మీగారికి ఘనంగా జన్మదిన శుభాకాంక్షలు

**మునుగోడు నియోజకవర్గ ఎన్నికల ఇంచార్జ్ పబ్బు రాజు దంపతులు శుభాకాంక్షలు తెలియజేశారు**



**తొలి అక్షరం/చౌటుప్పల్, ఆగస్టు 09:** కోమటిరెడ్డి సుశీలమ్మ ఫౌండేషన్ చైర్‌పర్సన్, మునుగోడు ఎమ్మెల్యే శ్రీ కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి సతీమణి లక్ష్మీ గారికి జన్మదిన సందర్భంగా పలువురు నాయకులు, అభిమానులు, శ్రేయోభిలాషులు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మునుగోడు నియోజకవర్గ ఎన్నికల ఇంచార్జ్ పబ్బు రాజు గౌడ్ దంపతులు కుటుంబ సమేతంగా లక్ష్మీగారిని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఆమెకు ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు, మరింత ప్రజాసేవ చేసే శక్తిని భగవంతుడు ప్రసాదించాలని ఆకాంక్షించారు. కోమటిరెడ్డి కుటుంబం ప్రజాసేవలో ఎల్లప్పుడూ ముందుంటుందని, ముఖ్యంగా లక్ష్మీగారు సామాజిక సేవా కార్యక్రమాలకు అండగా నిలుస్తూ, పేదలు, విద్యార్థులు, మహిళలు, అవసరంలో ఉన్న వారికి సహాయ సహకారాలు అందిస్తూ మానవతా దృక్పథంతో సేవలందిస్తున్నారని పబ్బు రాజు గౌడ్ దంపతులు కొనియాడారు. కోమటిరెడ్డి సుశీలమ్మ ఫౌండేషన్ ద్వారా చేపడుతున్న సేవా కార్యక్రమాలు ఎంతోమందికి అండగా నిలుస్తున్నాయని, భవిష్యత్తులో కూడా లక్ష్మీ గారి సేవా కార్యక్రమాలు మరింత విస్తరించి ప్రజలకు ఉపయోగపడాలని వారు ఆకాంక్షించారు. ఈ జన్మదినం లక్ష్మీగారి జీవితంలో మరిన్ని ఆనందాలను, విజయాలను తీసుకురావాలని, ప్రజలకు మరింత సేవ చేసే అవకాశం కలగాలని కోరుకుంటూ పబ్బు రాజు గౌడ్ దంపతులు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.

# డీఎస్సీ పై వైసిపి కుట్రలను యువత తిప్పి కొట్టాలి: టిడిపి నేత శ్రీనివాస రెడ్డి




**తొలి అక్షరం/కడప ఆగస్టు 09:-** గొడ్డలి పార్టీ నాయకులు డీఎస్సీ పై చేస్తున్న కుట్ర రాజకీయాలను యువత తిప్పికొట్టాలని టిడిపి నేత, జోనల్ కో-ఆర్డినేటర్ శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం నగరంలోని ద్వారకా నగర్ లో ఆయన నివాసంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో ముఖ్యమంత్రిగా చంద్రబాబు ఏడుసార్లు డిఎస్సి నిర్వహించాశారని, డీఎస్సీలో ఉత్తీర్ణులైన వారికి ఇంటర్వ్యూలో అవకతవకలు జరుగుతాయన్న ఉద్దేశంతో ఇంటర్వ్యూ రద్దు చేశారని పేర్కొన్నారు. మెరిట్ మార్కులు వచ్చిన వారికి నేరుగా ఉపాధ్యాయ ఉద్యోగాలు కల్పించబడతాయని తెలిపారు. డీఎస్సీ పరీక్షలు ఆన్లైన్లో జరిగింది వైసిపి నాయకులకు తెలియనిదా అని ప్రశ్నించారు. టిడిపి పాలనలోనే 75 శాతం ఉపాధ్యాయ పోస్టులు భర్తీ అయ్యాయని, వైసిపి నాయకులకు కడుపు మండి, ఉపాధ్యాయ ఉద్యోగాలు సాధించిన వారి కడుపు కొట్టే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. కోవిడ్ సమయంలో ఉపాధ్యాయులను బ్రాందీ షాపుల్లో పనులు చేయించిన ఘనత వైసిపి దేనని చెప్పారు. రాజకీయ నిరుద్యోగులు అయిన వైసిపి కార్యకర్తలతో ఆందోళన చేస్తున్నారని విమర్శించారు. వైసిపి నాయకులు డీఎస్సీ పై నిరసనలు, దీక్షలు చేయడం సిగ్గుచేటని పేర్కొన్నారు. ప్రతి ఏడు జాబ్ క్యాలెండర్ విడుదల చేసి నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని తెలిపారు. ఎన్ని జాబ్ క్యాలెండర్లు విడుదల చేసింది వైసిపి నాయకులు చెప్పాలని నిలదీశారు. వైసిపి దుష్ప్రచారాలను యువత, ప్రజలు తిప్పి కొట్టి, బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. ఉద్యోగాలు సాధించిన ఉపాధ్యాయులు కర్నూలు కొండారెడ్డి బురుజు ఎక్కి తమ సంతోషాన్ని వ్యక్తం చేశారని పేర్కొన్నారు. వారిని రెచ్చగొడితే తాడేపల్లి లో ఉన్న జగన్ ఇంటి పైకి ఎక్కగలరని హెచ్చరించారు.

# చౌటుప్పల్ అభివృద్ధి ఇదేనా...? నరకానికి దూరంగా మారిన వలిగొండ రోడ్డు

### వలిగొండ రోడ్డు దుస్థితి

### నాయకులకు కనిపించడం లేదా?

### బీఆర్ఎస్ నాయకుడు ఢిల్లీ మాధవ రెడ్డి ఘాటు విమర్శలు

**తొలి అక్షరం/చౌటుప్పల్: ఆగష్టు 9:** చౌటుప్పల్ పట్టణాన్ని అభివృద్ధి బాటలో నడిపిస్తామని చెబుతున్న నాయకులకు నరకానికి ద్వారంగా మారిన వలిగొండ రోడ్డు దుస్థితి కనిపించడం లేదా అని బీఆర్ఎస్ నాయకుడు ఢిల్లీ మాధవ రెడ్డి ఘాటుగా విమర్శించారు.వలిగొండ రోడ్డుపై నిత్యం వేలాది మంది ప్రయాణికులు రాకపోకలు సాగిస్తుంటారని, రోడ్డు మొత్తం గుంతలమయంగా మారడంతో వాహనదారులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. రోడ్డుపై ఏర్పడిన గుంతల్లో పడి పలువురు గాయాలపాలవుతున్నా సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోకపోవడం దారుణమన్నారు.వర్షాకాలంలో ఈ రోడ్డు పరిస్థితి మరింత అధ్వానంగా మారుతోందని, గుంతల్లో వర్షపు నీరు నిలిచి చిన్నపాటి స్విమ్మింగ్ పూల్స్‌ను తలపిస్తుండగా, ఎండాకాలంలో దుమ్ము, ధూళితో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ద్విచక్ర వాహనదారులు, ఆటోలు, కార్లు, ఇతర వాహనాల రాకపోకలకు ఈ రోడ్డు ప్రమాదకరంగా మారిందన్నారు.వలిగొండ రోడ్డు దుస్థితిపై ఇప్పటికే ఎన్నోసార్లు అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లామని, పలు పత్రికల్లో కూడా సమస్యపై వార్తలు ప్రచురితమయ్యాయని ఢిల్లీ మాధవ రెడ్డి గుర్తు చేశారు. అయినప్పటికీ ఇప్పటివరకు శాశ్వత పరిష్కారం చూపకపోవడం ప్రజల పట్ల నిర్లక్ష్యానికి నిదర్శనమని విమర్శించారు."చౌటుప్పల్‌ను అభివృద్ధి బాటలో నడిపిస్తామని చెప్పే నాయకులారా.. నరకానికి ద్వారంగా మారిన ఈ వలిగొండ రోడ్డు మీకు కనిపించడం లేదా? నిత్యం వేలాది మంది పడుతున్న ఇబ్బందులు మీకు కనిపించడం లేదా? గుంతల్లో పడి గాయాలపాలవుతున్న ప్రయాణికుల బాధలు మీకు కనిపించడం లేదా?" అని ఆయన ప్రశ్నించారు.ఇకనైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి వలిగొండ రోడ్డును పూర్తిస్థాయిలో అభివృద్ధి చేసి, నాణ్యమైన రహదారిని నిర్మించాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రజలకు సురక్షితమైన రహదారి ప్రయాణాన్ని అందించేందుకు వెంటనే చర్యలు చేపట్టి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని బీఆర్ఎస్ నాయకుడు ఢిల్లీ మాధవ రెడ్డి కోరారు.



# కొయ్యలగూడెం వరసిద్ధి వినాయక ఆలయ నూతన కమిటీ ఎన్నిక

### • నూతన అధ్యక్షులుగా రవ్వ సంతోష్ కుమార్



**తొలి అక్షరం/చౌటుప్పల్ ఆగష్టు 9:** చౌటుప్పల్ మండలం కొయ్యలగూడెం గ్రామ శ్రీ శ్రీ శ్రీ వరసిద్ధి వినాయక స్వామి దేవాలయం, కొయ్యలగూడెం గ్రామంలో నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆదివారం నిర్వహించిన సర్వసభ్య సమావేశానికి సర్పంచ్ కరీంకొండ స్వప్న అశోక్, ఉప సర్పంచ్ జెల్ల పవన్, రామాలయం చైర్మన్ మాచర్ల సంతోష్ కుమార్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆలయ అభివృద్ధి, భక్తులకు మెరుగైన సౌకర్యాల కల్పన, ఆలయ కార్యక్రమాలను మరింత ఘనంగా నిర్వహించేందుకు నూతన కమిటీని ఏర్పాటు చేశారు. ఆలయ నూతన అధ్యక్షులుగా రవ్వ సంతోష్ కుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.అదేవిధంగా నూతన డైరెక్టర్లుగా ఏలే మురళి, సూరకంటి మోహన్ రెడ్డి, కొయ్యడి స్వామి గౌడ్, అల్మాస్‌పేట గౌతమ్, రాసాల నర్సింహా, దికొండ ఉదయ్ కిరణ్లను ఎన్నుకున్నారు. నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులకు సర్వసభ్య సమావేశంలో పలువురు అభినందనలు తెలిపారు.ఆలయ ప్రతిష్ఠను మరింత పెంపొందిస్తూ, భక్తుల సహకారంతో దేవాలయ అభివృద్ధికి కృషి చేస్తామని నూతన కమిటీ సభ్యులు తెలిపారు. గ్రామ ప్రజలు, భక్తులు అందరూ సహకరించి ఆలయ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని వారు కోరారు.

# సేవా స్ఫూర్తితో కోమటిరెడ్డి సుశీలమ్మ ఫౌండేషన్ చైర్మన్ లక్ష్మీ మేడం జన్మదిన వేడుకలు

### - వారణాసిలో అనాథ చిన్నారులకు అన్నదానం నిర్వహించిన చౌటుప్పల్ పురపాలక వైస్ చైర్మన్ గోశిక వినయ్ కుమార్




**తొలి అక్షరం/చౌటుప్పల్: ఆగష్టు 9:** మునుగోడు శాసనసభ్యులు శ్రీ కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి గారి సతీమణి, కోమటిరెడ్డి సుశీలమ్మ ఫౌండేషన్ చైర్‌పర్సన్ శ్రీమతి కోమటిరెడ్డి లక్ష్మీ మేడం గారి జన్మదినాన్ని పురస్కరించుకుని పవిత్ర పుణ్యక్షేత్రమైన వారణాసిలో అనాథ చిన్నారులకు అన్నదానం నిర్వహించారు.జన్మదిన వేడుకలను ఆడంబరాలకు దూరంగా సేవా కార్యక్రమంతో నిర్వహించడం అభినందనీయమని పురపాలక వైస్ చైర్మన్ శ్రీ గోశిక వినయ్ కుమార్ అన్నారు. ఆపదలో ఉన్న చిన్నారులకు అన్నం పెట్టి వారి ఆకలి తీర్చడం ద్వారా మానవత్వాన్ని చాటిచెప్పారని పేర్కొన్నారు.సమాజంలో అవసరమైన వారికి అండగా నిలవడం, సేవా కార్యక్రమాలను కొనసాగించడం ద్వారా లక్ష్మీ మేడం గారు ఎంతోమందికి స్ఫూర్తిగా నిలుస్తున్నారని గోశిక వినయ్ కుమార్ తెలిపారు. పవిత్రమైన వారణాసి క్షేత్రంలో అనాథ చిన్నారులకు అన్నదానం చేయడం మరింత విశిష్టమైన సేవా కార్యక్రమమని అన్నారు.భగవంతుని ఆశీస్సులతో శ్రీమతి కోమటిరెడ్డి లక్ష్మీ మేడం గారికి సంపూర్ణ ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు, దీర్ఘాయుష్షు కలగాలని, భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టి ప్రజలకు సేవ చేసే అవకాశం కలగాలని ఆయన ఆకాంక్షించారు. కోమటిరెడ్డి లక్ష్మీ మేడం గారికి హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

# రోడ్డు ప్రమాదంలో ముత్యాల శివ మృతి

### కాంగ్రెస్ పార్టీకి తీరని లోటు

### గ్రామ సర్పంచ్ కందిమల్ల గోపాల్ రెడ్డి ప్రధాన అనుచరుడు ఇక లేరు

### శోక సంద్రంలో నీర్నంల గ్రామ వాసులు

రామన్నపేట మండలం నీర్నంల గ్రామానికి చెందినముత్యాల శివ తన వ్యక్తిగత పనుల రీత్యా చిట్యాల రోడ్డు మార్గంలో ప్రయాణిస్తుండగా లారీ ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందినట్లు స్థానికులు చెప్పడం జరిగింది. ముత్యాల శివ వ్యక్తిగత జీవితం మాదిగ సామాజిక వర్గానికి చెందిన ముత్యాల శివ వృత్తిరీత్యా మేస్త్రి పని చేసుకుంటూ తన కుటుంబాన్ని పోషిస్తున్నారు గత కొద్ది సంవత్సరాల క్రితం వారి సోదరుడు ముత్యాల నాగరాజు రోడ్డు ప్రమాదంలో మృతి చెందడం జరిగింది. వీరు ముగ్గురు అన్నదమ్ములు ఒక చెల్లి కుటుంబ పోషణ కోసం ఎంతో కష్టాలకు వచ్చి ఎన్నో బాధలు అనుభవిస్తూ మేస్త్రి పని నేర్చుకొని ఎంతో సిన్సియర్గా మంచి మేస్త్రిగా గుర్తింపు



తెచ్చుకుని ఈ ప్రాంతంలో మంచి పేరు తెచ్చుకున్నాడు. చిన్ననాటి నుంచే కాంగ్రెస్ పార్టీ యువజన నాయకునిగా కొనసాగుతూ ఉండేవారు. ప్రధానంగా గత 15 సంవత్సరాల నుంచి గ్రామ సర్పంచ్ కందిమల్ల గోపాల్ రెడ్డి ప్రధాన అనుచరునిగా కొనసాగుతూ ఉంటున్నాడు. కందిమల్ల గోపాల్ రెడ్డి గ్రామ సర్పంచ్ ఎన్నికల గెలుపులో కీలకపాత్ర పోషించినారు. గ్రామంలో ఎంతోమంది పేదరికంలో చనిపోయిన వారికి కందిమల్ల ఫౌండేషన్ ద్వారా ప్రతి కుటుంబానికి పదివేల రూపాయల ఆర్థిక సహాయం తన గురువును ఒప్పించి ప్రజలకు మీ యొక్క సేవలు చాలా అవసరం అని కందిమల్ల ఫౌండేషన్ ద్వారా గ్రామంలో ఆర్థిక సహాయం చేయించడంలో ముత్యాల శివది ప్రధాన పాత్ర ముక్కుసూటి మనిషిగా మంచి మానవత్వం ఉన్న మనిషిగా న్యాయం కోసం నిరంతరం పోరాటం చేసే వ్యక్తిగా కందిమల్ల గోపాల్ రెడ్డికి గ్రామ పౌరులకు ఆదర్శంగా ముత్యాల శివ నిలిచినారు. దైవం ఒకటి తెలిస్తే కాలం మరొకటి తలచినట్టు రోడ్డు ప్రమాదంలో ముత్యాల శివ ను వారి కుటుంబం నుంచి కందిమల్ల గోపాల్ రెడ్డి నుంచి దూరంగా తీసుకపోవడం చాలా విషాదకరమైన విషయమని గ్రామస్తులు ఆయన యొక్క స్నేహితులు తెలిపినారు.ఏది ఏమైనా ఒక నిరుపేద కుటుంబంలో రోడ్డు ప్రమాదంలో ఇద్దరు సోదరులు 14 సంవత్సరాల లోపు మరణించడం చాలా బాధాకరం

# హెల్త్ హబ్‌గా వరంగల్ నగరం..

### రాష్ట్రంలో రెండో అతిపెద్ద నగరంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి

### వైద్య రంగ అభివృద్ధికి అన్ని విధాలా సహకరిస్తా - ఎమ్మెల్యే నాయిని

**తొలి అక్షరం/హన్మకొండ ప్రతినిధి:** వరంగల్ నగరాన్ని రాష్ట్రంలోనే ప్రముఖ హెల్త్ హబ్‌గా అభివృద్ధి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి తెలిపారు.ఇప్పటికే విద్య,వైద్యం, వాణిజ్యం, పారిశ్రామిక రంగాల్లో వరంగల్‌కు ఉన్న ప్రాధాన్యతను మరింత పెంచేలా ప్రభుత్వం చర్యలు చేపడుతోందన్నారు. హనుమకొండలోని ఆరేపల్లి వజ్ర గార్డెన్స్‌లో నిర్వహించిన తానకోన్ (టి హెచ్ ఎ ఎన్ ఎ సి ఓ ఎన్)ఎనాచీూజూచీ కార్యక్రమంలో వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి,వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు.రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి వైద్యులు,వైద్య నిపుణులు,ఆరోగ్య రంగ ప్రతినిధులు వరంగల్ వేదికగా సమావేశం కావడం పట్ల ఎమ్మెల్యే నాయిని హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాయిని మాట్లాడుతూ...రాష్ట్ర స్థాయి వైద్యుల సమావేశానికి వరంగల్ నగరం వేదిక కావడం ఎంతో సంతోషకరమైన విషయమని అన్నారు.ఇలాంటి సమావేశాలు వరంగల్‌లో నిర్వహించడం ద్వారా నగరానికి ఉన్న వైద్య రంగ సామర్థ్యం మరింతగా వెలుగులోకి వస్తుందని తెలిపారు.వరంగల్ నగరం ఇప్పటికే ఉత్తర తెలంగాణకు ప్రధాన వైద్య కేంద్రంగా ఉందని,ఉమ్మడి వరంగల్ జిల్లాతో పాటు చుట్టుపక్కల జిల్లాల ప్రజలు వైద్యం కోసం వరంగల్‌కు వస్తున్నారని పేర్కొన్నారు.ప్రభుత్వ,ప్రైవేట్ వైద్య రంగాల్లో మరిన్ని ఆధునిక సదుపాయాలు అందుబాటులోకి వస్తే వరంగల్‌ను మరింత పెద్ద వైద్య కేంద్రంగా తీర్చిదిద్దే అవకాశం ఉందన్నారు.రాష్ట్ర వైద్య,ఆరోగ్య శాఖ మంత్రి వరంగల్ వైద్య రంగంపై ప్రత్యేక దృష్టి సారించడం








అభినందనీయమని ఎమ్మెల్యే నాయిని పేర్కొన్నారు.వరంగల్ నగరంలో వైద్య మౌలిక వసతుల విస్తరణ,ప్రభుత్వ ఆసుపత్రుల అభివృద్ధి,ఆధునిక వైద్య పరికరాల ఏర్పాటు,నిపుణులైన వైద్య సేవలను అందుబాటులోకి తీసుకురావడం వంటి అంశాలకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందన్నారు.వరంగల్‌ను హెల్త్ హబ్‌గా అభివృద్ధి చేయడానికి స్థానిక ఎమ్మెల్యేగా తన వంతు పూర్తి సహకారం అందిస్తానని నాయిని రాజేందర్ రెడ్డి స్పష్టం చేశారు.వైద్య రంగానికి సంబంధించిన అవసరాలు,సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంతో పాటు అవసరమైన అభివృద్ధి కార్యక్రమాల కోసం నిరంతరం కృషి చేస్తానన్నారు.వైద్య రంగంలో వస్తున్న ఆధునిక సాంకేతికత,కొత్త చికిత్సా విధానాలు,పరిశోధనలు, వైద్య సేవల విస్తరణపై వైద్యులు పరస్పరం చర్చించుకోవడం ద్వారా ప్రజలకు మరింత మెరుగైన వైద్య సేవలు అందించే అవకాశం ఉంటుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు.వరంగల్ నగరాన్ని కేవలం విద్యా,చారిత్రక నగరంగానే కాకుండా ఆధునిక వైద్య సేవలకు ప్రధాన గమ్యస్థానంగా తీర్చిదిద్దాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని ఆయన తెలిపారు. ఇందుకోసం ప్రజాప్రతినిధులు,వైద్యులు, అధికారులు,ప్రైవేట్ వైద్య సంస్థలు సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు.రాష్ట్ర స్థాయి వైద్యుల సమావేశాన్ని వరంగల్‌లో విజయవంతంగా నిర్వహించడం ద్వారా నగరానికి వైద్య రంగంలో ఉన్న అవకాశాలు మరోసారి స్పష్టమయ్యాయని ఎమ్మెల్యే నాయిని తెలిపారు. భవిష్యత్‌లో మరిన్ని జాతీయ,రాష్ట్ర స్థాయి వైద్య సదస్సులు వరంగల్‌లో నిర్వహించేలా అవసరమైన సహకారం అందిస్తానని చెప్పారు.ఈ కార్యక్రమంలో వైద్య రంగానికి చెందిన పలువురు ప్రముఖులు పెసరు విజయ్ చందర్ రెడ్డి,వైద్యులు కాళీప్రసాద రావు,ప్రవీణ్,ప్రజాప్రతినిధులు,నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

# రైతు మేళా 2026ను విజయవంతం చేయాలి

### - జిల్లా వ్యవసాయ అధికారి విజయచంద్ర



**తొలి అక్షరం/హన్మకొండ ప్రతినిధి:** హనుమకొండ జిల్లా కాళోజీ కళాక్షేత్రంలో (ఈ నెల 10) నేడు నిర్వహించనున్న జిల్లా స్థాయి రైతు మేళా2026ను విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా వ్యవసాయ అధికారి విజయ చంద్ర ఒక ప్రకటనలో తెలిపారు.రైతులకు వ్యవసాయ రంగంలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం,నూతన సాగు పద్ధతులు,ప్రభుత్వ వ్యవసాయ పథకాలు,అధిక దిగుబడులు సాధించే విధానాలపై అవగాహన కల్పించేందుకు రైతు మేళాను నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.రైతులు ఎదుర్కొంటున్న సమస్యలకు శాస్త్రీయ పరిష్కారాలు,సాగులో ఎదురవుతున్న సవాళ్లపై నిపుణులతో అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు.రైతు మేళాలో మట్టి పరీక్షలు,సాయిల్ ప్రొఫైలింగ్,వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలోని వివిధ కార్యక్రమాలు,ఎరువులువిత్తనాల వినియోగం,ఆధునిక వ్యవసాయ పద్ధతులు,పంటల సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలు తదితర అంశాలపై రైతులకు అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు.వ్యవసాయ అనుబంధ రంగాలకు సంబంధించిన అధికారులు,శాస్త్రవేత్తలు,నిపుణులు పాల్గొని రైతులకు అవసరమైన సూచనలు,సలహాలు అందిస్తారని చెప్పారు.ప్రభుత్వం రైతుల సంక్షేమం,వ్యవసాయ రంగ అభివృద్ధికి అమలు చేస్తున్న పథకాలు,కార్యక్రమాలపై రైతులకు సమగ్ర సమాచారం అందించడంతో పాటు,ఆధునిక సాంకేతికతను వ్యవసాయంలో వినియోగించుకునేలా ప్రోత్సహించడమే రైతు మేళా ప్రధాన ఉద్దేశ్యమని జిల్లా వ్యవసాయ అధికారి తెలిపారు.జిల్లాలోని రైతులు పెద్ద సంఖ్యలో రైతు మేళాకు హాజరై,వ్యవసాయ నిపుణులు,అధికారుల సూచనలు, సలహాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి విజయచంద్ర కోరారు.

# వయోధికుల పెద్ద కొడుకు.. అన్నార్తుల అన్నదానుడు

- **రెడీ టూ సర్వ్ ఫౌండేషన్ పెద్ది శంకర్ గౌడ్ సేవలకు జేజేలు**

**హైదరాబాద్:** చిన్న వయసులోనే తల్లిదండ్రులను కోల్పోయి ఎన్నో కష్టాలను ఎదుర్కొన్న ఓ బాలుడు.. నేడు అనాథ వృద్ధులకు పెద్ద కొడుకుగా మారాడు. కన్నవారు పట్టించుకోని పండుటాకులకు అండగా నిలుస్తూ, అనారోగ్యంతో బాధపడుతున్న వారికి ఆపద్బాంధవుడిగా మారాడు. ఆకలితో ఉన్నవారికి అన్నం పెడుతూ.. ఆశ్రయం లేనివారికి నీడనిస్తూ.. మానవత్వమే తన జీవిత ధ్యేయంగా ముందుకు సాగుతున్న రెడీ టూ సర్వ్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు పెద్ది శంకర్ గౌడ్ సేవా ప్రస్థానం ఎందరికో ఆదర్శంగా నిలుస్తోంది. **చిన్న వయసులోనే కన్నవారిని కోల్పోయి..** ఉమ్మడి నల్గొండ జిల్లా మాడ్గులపల్లి మండలం గార్లకుంటపాలెం గ్రామానికి చెందిన పెద్ది శంకర్ గౌడ్ ఐదో తరగతి చదువుతున్న వయసులోనే తల్లిదండ్రులను కోల్పోయారు. మిర్యాలగూడ బీసీ హాస్టల్‌లో విద్యాభ్యాసం కొనసాగించిన ఆయన అనంతరం హైదరాబాద్‌కు వచ్చి క్యాటరింగ్ రంగంలో పనిచేశారు. ఆ సమయంలో ఆయన పరిస్థితిని గుర్తించిన అమ్మ ఫౌండేషన్ వ్యవస్థాపకులు నాగమళ్ల అనిల్ కుమార్ అండగా నిలిచి ఆశ్రయం కల్పించారు.తర్వాత బసవతారకం క్యాన్సర్ ఆస్పత్రిలో ఉద్యోగం చేస్తూనే ఆస్పత్రికి వచ్చే రోగులు, వారి సహాయకుల ఆకలి బాధను గుర్తించి 'రెడీ టూ సర్వ్ ఫౌండేషన్' ఆధ్వర్యంలో అన్నదానం ప్రారంభించారు. అప్పటి నుంచి ప్రారంభమైన ఆ సేవా కార్యక్రమం నేటికీ నిరంతరంగా కొనసాగుతోంది. **వృద్ధులకు నీడగా.. పెద్ద కొడుకుగా** తన జీవితంలో ఎదుర్కొన్న కష్టాలు మరెవరూ ఎదుర్కోకూడదనే సంకల్పంతో సుమారు 15 ఏళ్ల క్రితం సైదాబాద్‌లో రెడీ టూ సర్వ్ ఫౌండేషన్‌ను స్థాపించారు. అనంతరం 2021లో వృద్ధాశ్రమాన్ని సైదాబాద్ నుంచి వనస్థలిపురానికి తరలించారు. ప్రస్తుతం మూసారాంబాగ్‌లో కూడా మరో ఆశ్రమాన్ని నిర్వహిస్తున్నారు. వనస్థలిపురం డీమార్ట్ వెనుక ఉన్న రెండు పడకల నివాసాన్ని సైతం వృద్ధాశ్రమంగా మార్చి, దిక్కులేని వృద్ధులకు ఆశ్రయం కల్పిస్తున్నారు. ఇంటి యజమానికి నామమాత్రపు అద్దె చెల్లిస్తూ ఆశ్రమాన్ని నిర్వహిస్తున్నారు. రోజురోజుకూ ఆశ్రయం కోసం వచ్చే వృద్ధుల సంఖ్య పెరుగుతుండటంతో ప్రస్తుత గదులు సరిపోక కొందరిని వెనక్కి పంపాల్సి వస్తోందని శంకర్ గౌడ్ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.అందుకే మరింత మందికి ఆశ్రయం కల్పించేందుకు పూర్తిస్థాయి వృద్ధాశ్రమం నిర్మించాలనే సంకల్పంతో స్థలం కోసం విరాళాలను కోరుతున్నారు. ఒక్క చదరపు అడుగుకు రూ.3,500 చొప్పున సహాయం చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు. సహాయం చేయదలచిన వారు 9701295527 నంబర్‌ను సంప్రదించాలని కోరుతున్నారు. **ఆస్పత్రుల వద్ద నిరంతర అన్నదానం** రెడీ టూ సర్వ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రతి ఆదివారం వనస్థలిపురం, గాంధీ, ఉస్మానియా, నీలోఫర్, ఎంఎన్‌జే, బసవతారకం తదితర ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఏదో ఒక చోట అన్నదానం నిర్వహిస్తున్నారు. తొలినాళ్లలో సుమారు 50 మందికి అన్నదానం చేసిన ఈ సేవ ప్రస్తుతం ఒక్కో కార్యక్రమంలో 200 నుంచి 300 మందికి ఆహారం అందించే స్థాయికి చేరుకుంది.ఆకలితో ఆస్పత్రుల వద్ద ఎదురుచూస్తున్న రోగుల సహాయకులకు, నిరుపేదలకు ఉచితంగా భోజనం అందించడం ఫౌండేషన్ నిరంతర సేవా కార్యక్రమాల్లో ఒకటిగా మారింది. **'గేమ్ చేంజర్' సినిమాలో ఆశ్రమ వృద్ధులకు అవకాశం** పెద్ది శంకర్ గౌడ్ ఎన్నో ఏళ్లుగా చేస్తున్న సేవలను గుర్తించిన 'గేమ్ చేంజర్' చిత్ర బృందం ఆశ్రమంలోని వృద్ధులకు సినిమాలో నటించే అవకాశం కల్పించింది. ఆశ్రమ నిర్వహణ,






వృద్ధుల పరిస్థితిని సినిమా బృందానికి వివరించడంతో వారు స్పందించి ఫౌండేషన్‌కు ఆర్థిక సహాయం అందించారు.ప్రముఖ నటుడు చిరంజీవి రూ.లక్ష చెక్కు అందించగా, ప్రముఖ ఆర్టిస్ట్ గీతా భాస్కర్ రూ.50 వేల సాయం చేశారు. బతుకమ్మ హీరో భాస్కర్, దర్శకుడు శ్రీకాంత్ రెడ్డి, నటి లోరా మెడిసన్ తదితరులు కూడా తమ వంతు సహకారం అందించారు. **సీనియర్ నటి పావలా శ్యామలకు అండగా..** వృద్ధాప్యంలో అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న సీనియర్ నటి పావలా శ్యామలకు కూడా పెద్ది శంకర్ గౌడ్ తన ఆశ్రమంలో ఆశ్రయం కల్పించారు. ఆమె ఆస్పత్రిలో మృతి చెందిన అనంతరం మృతదేహాన్ని ఆశ్రమానికి తీసుకువచ్చారు. అనంతరం 'మా' అసోసియేషన్ సభ్యులు స్పందించి మృతదేహాన్ని తీసుకెళ్లి జూబ్లీహిల్స్‌లో అంత్యక్రియలు నిర్వహించారు. తల్లి మరణంతో దీనస్థితిలో ఉన్న ఆమె కుమార్తె మాధవికి సైతం శంకర్ గౌడ్ అండగా నిలిచి ఆదుకున్నారు. **సేవే జీవిత ధ్యేయంగా..** తాను చిన్నతనంలో కోల్పోయిన తల్లిదండ్రుల లోటు తన జీవితాంతం వెంటాడినా.. అదే బాధను సేవగా మలుచుకున్న శంకర్ గౌడ్, తల్లిదండ్రులు లేని వృద్ధులకు పెద్ద కొడుకుగా మారారు. ఆకలితో ఉన్నవారికి అన్నం.. ఆశ్రయం లేనివారికి నీడ.. ఆపదలో ఉన్నవారికి అండగా నిలుస్తూ మానవత్వానికి నిలువెత్తు నిదర్శనంగా నిలుస్తున్నారు.ఆగస్టు 10న పెద్ది శంకర్ గౌడ్ జన్మదినం సందర్భంగా ఆయన మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టేలా ఆశీర్వదిద్దాం.. ఆయన సేవా సంకల్పానికి మన వంతు సహకారం అందిద్దాం. తలారి గణేష్ 9948026058

## అమరవీరుల స్తూపం ఆవరణలో నూతన హంగులు


**- కొత్త మొక్కలతో ఆహ్లాదకర వాతావరణం.. సుందరీకరణకు శ్రీకారం**



**తొలి అక్షరం/షాద్ నగర్, ఆగస్టు09:** షాద్‌నగర్: స్థానిక ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ సూచనల మేరకు షాద్‌నగర్‌లోని అమరవీరుల స్తూపం ఆవరణలో సుందరీకరణ పనులు చేపట్టారు. సాఫ్ట్ ల్యాండ్‌స్కేపింగ్ కాంట్రాక్టర్ వెంకటయ్య యాదవ్ ఆధ్వర్యంలో వివిధ రకాల అలంకరణ మొక్కలను నాటి ఆవరణకు నూతన శోభను తీసుకొచ్చారు.విచ్ మీడియా గోల్డ్, మాల్ఫీజియా కోన్స్, మైక్రో కార్ప్ బాల్స్, ఫ్లవరింగ్ యజ్జోర, పాండనాస్, ఐరన్ హెడ్జ్ బార్డర్ తదితర రకాల మొక్కలను ఏర్పాటు చేశారు. మొక్కల పెంపకంతో అమరవీరుల స్తూపం పరిసరాలు మరింత పచ్చదనంతో కళకళలాడుతున్నాయి.పెరుగుతున్న కాలుష్యాన్ని నియంత్రించడంలో మొక్కలు కీలక పాత్ర పోషిస్తాయని, స్వచ్ఛమైన గాలిని అందించడంతో పాటు ప్రజల ఆరోగ్యానికి, ఆహ్లాదకరమైన వాతావరణానికి ఇవి దోహదపడతాయని నిర్వాహకులు తెలిపారు. షాద్‌నగర్‌లోని ఇతర ప్రాంతాలకు భిన్నంగా అమరవీరుల స్తూపం ఆవరణను సుందరంగా తీర్చిదిద్దడం అభినందనీయమని పలువురు పేర్కొన్నారు.ఈ కార్యక్రమాన్ని షాద్‌నగర్ తాలూకా జేఏసీ నాయకులు పర్యవేక్షించారు. జేఏసీ చైర్మన్ మూలే జనార్ధన్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ త్రిప్పిశెట్టి కరుణాకర్, జేఏసీ కన్వీనర్ నక్క బాల్‌రాజ్ యాదవ్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గడ్డం శ్రీనివాస్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## అనారోగ్యంతో చికిత్స పొందుతున్న మహిళకు కాంగ్రెస్ యకుడు జెట్ట రాజు పరామర్శ

- **రోగికి అండగా జెట్ట రాజు.. సీఎం రిలీఫ్ ఫండ్‌కు హామీ**
- **మానవత్వం చాటుకున్న రాజు.. ఆసుపత్రిలో మహిళకు పరామర్శ**



**తొలి అక్షరం/షాద్ నగర్, ఆగస్టు09:** నందిగామ: అనారోగ్యంతో శంషాబాద్‌లోని లిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న నందిగామ మండలం మోత్కులగూడ గ్రామానికి చెందిన శైలజశివకుమార్ కుటుంబ సభ్యురాలిని కాంగ్రెస్ పార్టీ నాయకుడు జెట్ట రాజు పరామర్శించారు. గత నెల 20వ తేదీ నుంచి ఆమె ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విషయం తెలుసుకున్న ఆయన ఆసుపత్రికి వెళ్లి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.అనంతరం వైద్యులతో మాట్లాడి రోగికి అవసరమైన వైద్య, మౌలిక సదుపాయాలు అందించాలని కోరారు. తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని, సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా ఆర్థిక సాయం అందేలా ప్రభుత్వ స్థాయిలో ముందుండి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అనారోగ్యంతో బాధపడుతున్న కుటుంబానికి అండగా ఉంటామని భరోసా కల్పించారు.ఈ కార్యక్రమంలో మోత్కులగూడ గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు జెట్ట రాజు, 4వ వార్డు సభ్యుడు జెట్ట నరేష్, కాంగ్రెస్ నాయకులు అనంతి (మహేష్) తదితరులు పాల్గొన్నారు.

## డీజీపీ సీవీ ఆనంద్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్



**తొలి అక్షరం/ హన్మకొండ ప్రతినిధి:** ఉమ్మడి వరంగల్ జిల్లా పర్యటనలో భాగంగా హనుమకొండలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎన్ఐటీ)లో ఉన్న తెలంగాణ రాష్ట్ర డీజీపీ సీవీ ఆనంద్,ఐపీఎస్‌ను హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా కలెక్టర్ డీజీపీకి పుష్పగుచ్ఛం అందజేసి ఆత్మీయంగా స్వాగతం పలికారు.

## 4.38 కోట్ల విలువైన ప్రభుత్వ సీఎంఆర్ ధాన్యం దుర్వినియోగం

**వైష్ణవి రైస్ మిల్లు యజమానిపై క్రిమినల్ కేసు నమోదు: చిట్యాల సీఐ డి.మల్లేష్ వెల్లడి**

**తొలి అక్షరం/భూపాలపల్లి ప్రతినిధి:** చిట్యాల పిఎస్ పరిధిలో రూ. 4.38 కోట్లకు పైగా విలువైన ప్రభుత్వ సీఎంఆర్ ధాన్యం దుర్వినియోగం అయింది.వైష్ణవి రైస్ మిల్లు యజమానిపై క్రిమినల్ కేసు నమోదు చేశారు.ప్రభుత్వానికి సకాలంలో కస్టమ్ మిల్లింగ్ రైస్ (సి ఎం ఆర్) అప్పగించకుండా ధాన్యాన్ని పక్కదారి పటించి,నిధులను దుర్వినియోగం చేస్తూ మోసానికి పాల్పడిన గిద్దముత్తారం గ్రామంలోని వైష్ణవి రైస్ మిల్లు యజమాని యాంశాని సంతోష్‌పై చిట్యాల పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసినట్లు చిట్యాల సీఐ డి. మల్లేష్ తెలిపారు.సివిల్ సప్లైస్ డిస్ట్రిక్ట్ మేనేజర్ (ం+ూజూజూ, జయశంకర్ భూపాలపల్లి) పి. రాములు ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు సీఐ వెల్లడించారు.జయశంకర్ భూపాలపల్లి జిల్లా చిట్యాల మండలం గిద్దముత్తారం గ్రామంలోని వైష్ణవి రైస్ మిల్లును విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్మెంట్,సివిల్ సప్లైస్ అధికారుల బృందం ఆకస్మిక తనిఖీ నిర్వహించగా భారీ వ్యత్యాసాలు






బయటపడ్డాయి.2022-23 రబీ సీజన్ 556.400 మెట్రిక్ టన్నుల ధాన్యానికి సంబంధించి ప్రభుత్వం నోటీసు జారీ చేయగా రూ.93,95,407/- చెల్లించాల్సి ఉండగా,కేవలం రూ. 55 లక్షలు చెల్లించారు.మిగిలిన రూ.38,95,407/- ఇప్పటివరకు చెల్లించలేదు. 2025- 26 ఖరీఫ్ సీజన్ మిల్లుకు కేటాయించిన 4218.080 మెట్రిక్ టన్నుల ధాన్యంలో 1328.728 మెట్రిక్ టన్నుల సి ఎం ఆర్ అప్పగించారు.మిగిలిన నిల్వల్లో 1251.434 మెట్రిక్ టన్నుల ధాన్యం బస్తాలు గోదాములో గైర్హాజరైనట్లు తనిఖీల్లో తేలింది.2025-26 రబీ సీజన్ కేటాయించిన 850.680 మెట్రిక్ టన్నుల ధాన్యంలో 176.880 మెట్రిక్ టన్నుల ధాన్యం బస్తాలు తక్కువగా ఉన్నాయి.2025-26 సంవత్సరానికి సంబంధించి తక్కువగా ఉన్న మొత్తం 1428.314 మెట్రిక్ టన్నుల (క్వింటాల్‌కి రూ.2,800/- చొప్పున) ధాన్యం విలువ రూ. 3,99,92,792/- కాగా, పాత బకాయి రూ. 38,95,407/- తో కలిపి మొత్తం రూ. 4,38,88,199/- ప్రభుత్వ సొమ్మును యజమాని యాంశాని సంతోష్ అనధికారికంగా విక్రయించి దుర్వినియోగానికి పాల్పడినట్లు ప్రాథమిక విచారణలో తేలింది. **క్రిమినల్ కేసు నమోదు** సివిల్ సప్లైస్ డిస్ట్రిక్ట్ మేనేజర్ పి.రాములు ఫిర్యాదు మేరకు వైష్ణవి రైస్ మిల్ యజమాని యాంశాని సంతోష్ పై చిట్యాల పోలీస్ స్టేషన్‌లో Essential Commodities (ఈ సి యాక్ట్) Act ప్రకారం కేసు నమోదు చేయడం జరిగిందని సీఐ డి. మల్లేష్ తెలిపారు. కేసు నమోదు చేసి సమగ్ర దర్యాప్తు చేపడుతున్నట్లు సీఐ వివరించారు.

# హామీలను అమలు చేయాలి

**ఆగస్టు 2 నుండి 18 వరకు అమరుల యాదిలో గీతన్నల చైతన్య యాత్ర**

**తొలి అక్షరం/రామన్నపేట ఆగస్టు 9:** కల్లుగీత కార్మికులకు కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ప్రణాళికలో ఇచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఆగస్టు 2 నుండి 18 వరకు అమరుల యాధిలో గీతన్నల చైతన్య బస్సు యాత్ర రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్నామని లికల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు ఎం. వి .రమణ, బెల్లంకొండ వెంకటేశ్వర్లుఅన్నారుపెన్షన్ 4 వేలకు పెంచుతామని, ఎక్స్‌గ్రేషియా 10 లక్షలు ఇస్తామని అవి కూడా నెల రోజుల లోపే ఇస్తామని కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ప్రణాళికలో చెప్పారు. కానీ ఇప్పటివరకు అమలుకు నోచుకోలేదని.వారు అన్నారు. వృత్తిలో ప్రమాదాలు జరిగిన వారికి ఇవ్వాల్సిన ఎక్స్‌గ్రేషియా 20 కోట్ల రూపాయలు అధికారంలోకి వచ్చి 30 నెలలు దాటినప్పటికీ ఇవ్వలేదని అన్నారు. 50 సంవత్సరాలు నిండిన వారికి పెన్షన్ ఇవ్వాలని జీవో ఉన్నప్పటికీ కొత్తగా ఎవరి దరఖాస్తులు స్వీకరించడం లేదని అన్నారు. మేము కొత్తగా కోరికలు ఏమి కోరడం లేదని మీరిచ్చిన వాగ్దానాలే అమలు చేయాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వారు మాట్లాడుతూ వృత్తిలో ప్రమాదాలు జరగకుండా ఉండేందుకు ప్రభుత్వం కాటమయ్య రక్షణ కవచం ఇస్తుందన్నారు. రాష్ట్రంలో సభ్యత్వం కలిగిన వాళ్లు 2 లక్షల 30 వేల మంది ఉండగా కేవలం 30 వేల మందికే ఇచ్చారని అన్నారు. వృత్తి చేసే వారందరికీ వెంటనే ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. తాటి ఈత చెట్ల పెంపకానికి



ప్రతి సొసైటీకి ఐదు ఎకరాలు చొప్పున భూమి ఇవ్వాలని, నీరా తాటి ఈత ఉత్పత్తుల పరిశ్రమలను ప్రోత్సహించాలని అన్నారు. నందనములోని నీరా ప్రాజెక్టు ను వెంటనే ప్రారంభించాలని డిమాండ్ చేశారు. బడ్జెట్లో నీరాకు కేటాయించిన 25 కోట్లు, సంక్షేమాని కి కేటాయించిన 67 కోట్లు వెంటనే విడుదల చేసి ఖర్చు చేయాలన్నారు. గీత కార్మికుల సమస్యలు పరిష్కారం కై ప్రభుత్వం పై ఒత్తిడి పెంచేందుకే ఈ యాత్ర నిర్వహిస్తున్నామన్నారు. ఆగస్టు 18 వరకు సర్దార్ సర్వాయి పాపన్న విగ్రహాన్ని ట్యాంక్ బండ్ పై ప్రతిష్టించాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యాత్ర బృందం రాగిరి కృష్ణయ్య ,వి. వెంకట నరసయ్య, గౌని ఎంకన్న, చౌగానీసీతారాములు, గౌని సాంబయ్య, పామనుగుళ్ళ అచ్చాలు, మొక్క నాగేశ్వరరావు,బుర్ర సుధాకర్, తాళ్లపల్లి నర్సయ్య, పాలకూరి జగన్, సురుగు రాజేష్ గౌడ్, హనుమాండ్ల కాడి నవీన్, జిల్లా అధ్యక్షులు రాగిరి కృష్ణయ్య బోలగోని జయరాములు గాజుల ఆంజనేయులు బామండ్ల పెల్లి బాలరాజు ఎర్ర రవీందర్ కునూరు మల్లేష్ మునుకుంట్ల లెనిన్ బైరు రమేష్పా తూర్పునూరు శ్రీను పబు గంగాధర్ల్ వెంకన్న పల్లె సత్యం ఆకిటి శీను పబ్బు శేఖర్ కనకయ్య గంగాధర్ అంజయ్యన్నారుఅభివందనములతో..కేజీ కేఎస్ మండల కమిటీ రామన్నపేట

# సాయిబాబా కాలనీలో ఘనంగా ఆషాఢ మాసం బోనాలు

**పోచమ్మ తల్లి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ బసవేశ్వర్**





**తొలి అక్షరం/షాద్ నగర్, ఆగస్టు09:** రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ మున్సిపాలిటీ 6వ వార్డు పరిధిలోని సాయిబాబా కాలనీలో ఆషాఢ మాసం బోనాల వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పోచమ్మ తల్లి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ బసవేశ్వర్ హాజరై అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని అమ్మవారిని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బాబర్ అలీ ఖాన్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు నల్లమోని శ్రీధర్ ముదిరాజ్, కౌన్సిలర్ రాజు నాయక్, శివ ఎస్పీ, కొప్పునూరి ప్రవీణ్ కుమార్, మున్సిపల్ కో-ఆప్షన్ సభ్యురాలు లత శ్రీశైలం గౌడ్, సభ్యుడు సయ్యద్ ఖదీర్, సీనియర్ నాయకుడు చెంది తిరుపతి రెడ్డి, ముబారక్ అలీ ఖాన్, సాదిక్, అనిల్ కుమార్, జయప్రకాష్, రాయికల్ శ్రీనివాస్, కరుణాకర్, బుచ్చయ్య, శ్రీధర్ రెడ్డి, కుమారస్వామి గౌడ్, రమేష్, సీతారాం, శేఖర్ తదితరులు పాల్గొన్నారు. అలాగే సాయిబాబా కాలనీ వాసులు శ్రీనివాస్, కిరణ్, ప్రభాకర్ రావు, మహదేవన్ అయ్యగారు, వెంకన్న బాబు, అమర్‌నాథ్ రెడ్డి, బెనూరి చంద్రయ్య, మంగ శంకర్, సిద్ధార్థ, చంద్రశేఖర్ రెడ్డి, శ్రీను, అనిల్ తదితరులు పాల్గొని బోనాల వేడుకలను విజయవంతం చేశారు. బోనాల సందర్భంగా ఆలయంలో భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించడంతో కాలనీలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది.


# మాస్టర్‌మైండ్స్ స్కూల్‌లో ఘనంగా తెలంగాణ బోనాల సంబరాలు



**తొలి అక్షరం/షాద్ నగర్, ఆగస్టు09:** తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బోనాల పండుగను ది మాస్టర్‌మైండ్స్ స్కూల్‌లో శనివారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు సంప్రదాయ దుస్తులు ధరించి వేడుకల్లో పాల్గొని సందడి చేశారు. బోనాల పండుగ విశిష్టతను తెలియజేసే పలు సాంస్కృతిక కార్యక్రమాలను ప్రదర్శించి ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. విద్యార్థులకు విద్యతో పాటు తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలపై అవగాహన కల్పించేందుకు అన్ని పండుగలను పాఠశాలలో ఘనంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. భిన్నత్వంలో ఏకత్వం, ఐక్యత, సోదరభావం వంటి విలువలను విద్యార్థుల్లో పెంపొందించడమే తమ లక్ష్యమన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# వైకల్య ధ్రువీకరణ పొందిన వారందరికీ పెన్షన్లు ఇవ్వాలి

**- ఆగస్టు 15 నుంచి కొత్త పెన్షన్లలో అర్హులైన వికలాంగులను చేర్చాలి**



**తొలి అక్షరం/షాద్ నగర్, ఆగస్టు09:** ఆగస్టు 15న ప్రభుత్వం మంజూరు చేయనున్న కొత్త చేయూత పెన్షన్లలో వైకల్య ధ్రువీకరణ పత్రాలు పొందిన అర్హులైన వికలాంగులందరికీ పెన్షన్లు మంజూరు చేయాలని వికలాంగుల హక్కుల జాతీయ వేదిక (ఎన్‌పిఆర్‌డి) రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు ఆశన్నగారి భుజంగారెడ్డి డిమాండ్ చేశారు. తలసేమియా, సికిల్ సెల్, హిమోఫీలియా బాధితులతో పాటు కొత్తగా వైకల్య ధ్రువీకరణ పత్రాలు పొందిన వారందరినీ పెన్షన్ పరిధిలోకి తీసుకురావాలని కోరారు. 2023 డిసెంబర్‌లో చేయూత పెన్షన్ల కోసం 24.85 లక్షల మంది, 2026 మేలో 10.22 లక్షల మంది దరఖాస్తు చేసుకున్నారని భుజంగారెడ్డి తెలిపారు. ఇప్పటికే దరఖాస్తు చేసుకున్న వారిని పరిగణనలోకి తీసుకోకుండా మరోసారి కొత్త దరఖాస్తులు స్వీకరించడం వల్ల లబ్ధిదారులకు ప్రయోజనం ఉండదని, మీసేవ కేంద్రాలకు మాత్రమే లాభం చేకూరుతుందని అన్నారు. గతంలో స్వీకరించిన దరఖాస్తుల ఆధారంగానే అర్హులను గుర్తించి పెన్షన్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం వేలాది మందికి కొత్తగా వైకల్య ధ్రువీకరణ పత్రాలు జారీ చేసినప్పటికీ, కొంతమంది వైకల్యాలతో ఉన్న వారికే పెన్షన్లు మంజూరు చేయాలని నిర్ణయించడం మిగతా వికలాంగులకు అన్యాయం చేయడమేనని ఆయన పేర్కొన్నారు. అర్హులైన వికలాంగులకు ఆదాయ పరిమితి, ఇతర షరతులు లేకుండా పెన్షన్లు మంజూరు చేయాలని కోరారు. పెన్షన్ల కోసం జూన్ 10న సెర్ప్ కార్యాలయం ఎదుట, జూలై 20న రాష్ట్రవ్యాప్తంగా కలెక్టరేట్ల ఎదుట ధర్నాలు నిర్వహించిన విషయాన్ని గుర్తుచేశారు. ప్రభుత్వం సమస్యను పరిష్కరించకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని భుజంగారెడ్డి హెచ్చరించారు.

# విద్యుత్ సబ్‌స్టేషన్ ముందు బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ధర్నా







**తొలి అక్షరం/రామన్నపేట ఆగస్టు 9:** రామన్నపేట మండల కేంద్రంలో విద్యుత్ సబ్ స్టేషన్ ముందు బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య ధర్నా నిర్వహించి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన నుండి రైతులను ఇబ్బందులకు గురి చేస్తూ రైతులకు ఇవ్వాల్సిన త్రీఫేస్ కరెంటు 24 గంటలు కాకుండా 10 గంటలు ఇస్తూ రైతులను చాలా ఇబ్బందులకు గురి చేయడం జరుగుతుంది అదేవిధంగా లో వోల్టేజి సమస్యలతో స్టార్టర్లు మోటర్లు కాలిపోవడం జరుగుతుంది దీనితో రైతులు తీవ్ర నష్టం జరుగుతుంది ఇప్పటికైనా ప్రభుత్వం రైతుల బాధలను అర్థం చేసుకొని నాణ్యమైన విద్యుత్తును అందించి రైతులకు సరిపడా త్రీఫేస్ కరెంటు సరఫరా చేసి రైతులను ఆదుకోవాలని ప్రభుత్వాన్ని కోరడం జరిగింది అనంతరం డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రం సమర్పించడం జరిగింది ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ మాజీ మండల అధ్యక్షులు బందెల రాములు పోషబోయిన మల్లేశం సర్పంచులు కంభంపాటి శ్రీనివాస్ గర్దాస్ విక్రమ్ మాజీ ఎంపీటీసీలు సర్పంచులు రేఖ యాదయ్య పున్న వెంకటేశం ఎండి అమీర్ జిల్లా నాయకులు కన్నెబోయిన బలరాం బద్దుల రమేష్ పట్టణ కార్యదర్శి జాడ సంతోష్ నాయకులు మెట్టు శ్రీనివాస్ రెడ్డి కోనూరు ముత్తయ్య కోళ్ల కిషన్ ఆవుల నరేందర్ చిన్నపాక శ్రీనివాస్ బొడ్డు అల్లయ్య చొప్పరి నరసింహ తాళ్ల క్రాంతి కుమార్ బండ శ్రీనివాస్ రెడ్డి మామిళ్ల అశోక్ గంగుల రాఘవరెడ్డి నక్క నరేందర్ బుర్ర శ్రీశైలం ఎండి అజాజ్ ఖాన్ ఆవుల శ్రీధర్ బొడ్డుపల్లి రాజు గర్దాస్ కరుణాకర్ వంగాల యాదయ్య జెల్ల శ్రీను కందగట్ల శ్రీను మామిళ్ళ కుమార్ మామిడి పద్మా రెడ్డి మేడి కృష్ణ కోనూరు ఆంజనేయులు అంతటి మల్లేశం నీరుడు కల్లూరి నరేష్ సురేష్ గోవు రమేష్ గణేష్ కొమ్మ గోని రమేష్ గర్దా శ్రీకాంత్ సంగిశెట్టి శివాజీ ఎండి ఆరిఫ్ బిక్షం ఐలయ్య పాపయ్య అంజయ్య యాదయ్య ముత్తయ్య తదితరులు పాల్గొనడం జరిగింది

# షాద్ నగర్ పట్టణంలోని సాయిబాబా కాలని,రామ్ నగర్ కాలనీలలో బోనాలు

**- పోచమ్మ ఆలయంలో ప్రత్యేక పూజాలు నిర్వహించిన ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి**






**తొలి అక్షరం/షాద్ నగర్, ఆగస్టు09:** షాదద్ నగర్ పట్టణంలోని సాయిబాబా కాలనీ,రామ్ నగర్ కాలనీలలో కొలువై ఉన్న పోచమ్మ,అమ్మవారి ఆలయాలలో బోనాల ఉత్సవాలు వైభవంగా జరిగాయి. ఈ వేడుకల్లో భాగంగా ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి అమ్మవార్ల ఆలయాలను సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి మాట్లాడుతూ..కాలనీ ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలత,అష్టైశ్వర్యాలతో వర్ధిల్లాలని అమ్మవార్లను ప్రార్థించినట్లు తెలిపారు. పట్టణంలోని ప్రతి ఇల్లూ సంతోషాలతో విలసిల్లాలని,ప్రజలందరికీ అమ్మవారి ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు వాని పాండురంగ రెడ్డి,అనిత రఘునాథ యాదవ్,ఎస్పీ శివ,రాజు నాయక్,సీనియర్ నాయకులు రాయికల్ వెంకటరెడ్డి,మాజీ కౌన్సిలర్ శ్రీనివాస్ గౌడ్,కంటెస్టెంట్ కౌన్సిలర్ రాజేందర్ సింగ్,సర్పంచులు నాగిళ్ల వెంకట వెంకట్,స్వప్న భూపాల్ రెడ్డి,మాజీ సర్పంచులు తాండ్ర విష్ణువర్ధన్ రెడ్డి,యారం శేఖర్ రెడ్డి,కాలనీవాసులు నాయుకులు చాట్ల రమేష్,జయంత్ రెడ్డి,సాయిప్రసాద్,అల్లాడ శేఖర్, కోమరేష్,హర్షవర్ధన్ రెడ్డి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## గ్రామంలో బోనాల పండుగకు ముమ్మరంగా

# సాగుతున్న రోడ్డు విస్తరణ పనులు





**- నెక్కొండ సర్పంచ్ ల ఫోరం అధ్యక్షులు, బంజరపల్లి సర్పంచ్ భూక్య రమేష్ రాథోడ్**



**తొలి అక్షరం/నెక్కొండ ఆగస్టు 9:** వరంగల్ జిల్లా నెక్కొండ మండల పరిధిలోని బంజరపల్లి గ్రామంలో నర్సంపేట అభివృద్ధి ప్రదాత ఎమ్మెల్యే దొంతి మాధవ రెడ్డి సహకారంతో గ్రామంలో రోడ్డు విస్తరణ పనులు శరవేగంగా సాగుతున్నాయి.. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ ఎర్ర సుజాత రాజు, కాంగ్రెస్ సీనియర్ పార్టీ నాయకులు వెంకటేశ్వర్లు వార్డ్ మెంబర్లు శ్రీను , సర్వర్ రాజారాం, సతీష్ కృష్ణ రాజేందర్ మరియు గ్రామ పెద్దలు పార్టీ పుర ప్రముఖులు గ్రామ పెద్దలందరూ పాల్గొనడం జరిగింది. ఉన్నస్తుగా గ్రామంలో ఘనంగా నిర్వహించబోయే బోనాల పండుగ ఉద్దేశించి గ్రామస్తులకు ఇలాంటి ఇబ్బందులు జరగకుండా రోడ్ల మరమ్మత్తు శరవేగంగా కొనసాగిస్తున్న బంజరపల్లి సర్పంచ్, నెక్కొండ మండల సర్పంచుల ఫోరం అధ్యక్షులు భుక్య రమేష్ రాథోడ్ సర్పంచ్ మాట్లాడుతూ గ్రామ అభివృద్ధికి సహాయ సహకారాలు అందిస్తున్న గ్రామ ప్రజలందరికీ ధన్యవాదాలు తెలియజేయడం జరిగింది..

# కొత్తపేట పీఏసీఎస్ చైర్మన్‌గా ఎన్నం శ్రీధర్‌రెడ్డి



**తొలి అక్షరం/షాద్ నగర్, ఆగస్టు09:** కొత్తపేట ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పీఏసీఎస్) చైర్మన్‌గా ఎన్నం శ్రీధర్‌రెడ్డి నియమితులయ్యారు. నూతన పాలకవర్గానికి ప్రభుత్వం బాధ్యతలు అప్పగించింది. షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ శ్రీధర్‌రెడ్డికి నియామక పత్రాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా బోదునంపల్లి గ్రామ సర్పంచ్ ఎదిరే నాగేశ్వర్ గ్రామ నాయకులతో కలిసి ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. పీఏసీఎస్ ద్వారా రైతులకు అవసరమైన రుణాలు, ఎరువులు, విత్తనాలు సకాలంలో అందేలా నూతన పాలకవర్గం కృషి చేయాలని కోరారు. రైతుల సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకొని వాటి పరిష్కారానికి చొరవ చూపాలని సూచించారు. కార్యక్రమంలో గ్రామ నాయకులు బండ రాజు, ఎదిరే మల్లయ్య, దోమ యాదయ్య, వెంకటాపురం నరసింహ, బాయి గడ్డ మహేష్, మెంట మల్లేష్, ఆనపూసల శేఖర్, తర్ర భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

# నర్సింహులపేట పిఏసిఎస్ నామినేటెడ్ చైర్మన్ పీఠంపై ఉత్కంఠ..

**తీవ్రమవుతున్న పోటీ, పైరవీల జోరు..**



**తొలిఅక్షరం/నర్సింహులపేట : ఆగస్టు 9:** నర్సింహులపేట మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం పిఏసిఎస్. నామినేటెడ్ చైర్మన్ పదవి కోసం అధికార పార్టీ నాయకులలో రేసు తీవ్రరూపం దాల్చింది. పదవిని ఎలాగైనా దక్కించుకోవాలనే లక్ష్యంతో ఆశావహులు జిల్లా స్థాయి ముఖ్య నేతలు, నియోజకవర్గ ప్రజాప్రతినిధుల వద్ద జోరుగా పైరవీలు సాగిస్తున్నారు. **సామాజిక వర్గాల పోటీ.. ఈసారి ఎస్సీలకే కేటాయించాలనే డిమాండ్:** చైర్మన్ పీఠం కోసం రెడ్డి, బీసీ సామాజిక వర్గాలకు చెందిన సీనియర్ నాయకులు గట్టిగా ప్రయత్నాలు చేస్తుండగా, సామాజిక న్యాయం ప్రకారం ఈసారి ఖచ్చితంగా ఎస్సీ సామాజిక వర్గానికి ఈ పదవిని కేటాయించాలనే డిమాండ్ బలంగా వినిపిస్తోంది. సుదీర్ఘకాలంగా పార్టీ కోసం కష్టపడిన ఎస్సీ వర్గ నాయకులకు అవకాశం ఇవ్వడం ద్వారా సరైన గుర్తింపు లభిస్తుందని, అందుకే అధిష్టానం ఈసారి ఎస్సీ సామాజిక వర్గానికే ప్రాధాన్యత ఇవ్వాలని ఆ వర్గ నేతలు గట్టిగా కోరుతున్నారు. రైతులకు సేవలతో పాటు రాజకీయంగా ప్రాధాన్యత ఉన్న ఈ పదవి ఎవరికి దక్కుతుందోనని మండలంలో తీవ్ర ఉత్కంఠ నెలకొంది. తీవ్రపోటీ మరియు పైరవీల నడుమ అధిష్టానం ఏ సామాజిక వర్గం వైపు మొగ్గు చూపుతుందో వేచి చూడాల్సిందే.

# రైతు సమస్యల పరిష్కారమే లక్ష్యం: జితేందర్ రెడ్డి




**తొలి అక్షరం/షాద్ నగర్, ఆగస్టు09:** ఉమ్మడి కొందుర్గ్ మండలం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పీఏసీఎస్) నూతన చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన తుమ్మలపల్లి జితేందర్ రెడ్డి ఆదివారం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుల ఆశీర్వాదం పొందారు. మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్ రెడ్డిని ఆయన స్వగృహంలో కలిసి ఆశీర్వాదం తీసుకున్నారు. అనంతరం కొత్తూరు మండలం మాజీ జడ్పీటీసీ సభ్యుడు మామిడి శ్యామ్ సుందర్ రెడ్డిని కలిసి ఆశీర్వచనం పొందారు. ఈ సందర్భంగా పార్టీ పెద్దలు జితేందర్ రెడ్డికి పలు సూచనలు చేశారు. రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను క్షేత్రస్థాయిలో అధ్యయనం చేసి, వారి సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేయాలని సూచించారు. రైతులకు ఎల్లప్పుడూ అండగా నిలిచి అవసరమైన సహాయ సహకారాలు అందించాలని, ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని దిశానిర్దేశం చేశారు. లభించిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటూ రైతుల సంక్షేమానికి పనిచేస్తానని జితేందర్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో కొందుర్గ్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పురుషోత్తం రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఆగస్టు 10న జరిగే జైల్ బరో కార్యక్రమాని విజయవంతం చెయ్యండి



**తొలి అక్షరం/రామన్నపేట ఆగస్టు 9:** సిఐటియు రామన్నపేట మండల కేంద్రంలో కరపత్రాన్ని ఆవిష్కరించిన సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి గో రిగే సోములు మాట్లాడుతూ నూతనంగా కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్లను వెంటనే రద్దు చేయాలి. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలి. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారంగా 26వేల వేతనం ప్రభుత్వం అమలుపరచాలి. గ్రామపంచాయతీ కార్మికులందరినీ పర్మనెంట్ చేయాలి. నూతనంగా తీసుకొచ్చిన మోటార్ వెహికల్ చట్టాన్ని ప్రభుత్వం రద్దు చేయాలి. సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు నకరికంటి రాము జిల్లా కమిటీ సభ్యులు అప్పం సురేందర్ వంగల మారయ్య బుడ్డ ప్రసాద్ జంపాల మహేష్ నూనె అంజయ్య తదితరులు పాల్గొన్నారు

# సూర్య బాలయ్య ముత్యాలమ్మ జ్ఞాపకార్థంగా మానవత్వం చాటుకున్న సూర్య రాజేంద్రకుమార్ అనిత




**తొలి అక్షరం/రామన్నపేట ఆగస్టు 9:** రామన్నపేట మండలం ఇంద్రపాలనగరం గ్రామంలో ముత్యాలమ్మ దేవాలయానికి నూతన కలర్స్( రంగులు)హైదరాబాద్ వాస్తవ్యులు కీర్తిశేషులు సూర్య బాలయ్య- ముత్యాలమ్మ జ్ఞాపకార్థం వారి కుమారుడు సూర్య రాజేంద్ర కుమార్ వారి ధర్మపత్ని అనిత సుమారు 50,000(యాభై వేల) రూపాయల రంగులు అందజేయడం జరిగింది. ఆదివారం రోజున నూతన రంగులు అలంకరణ కార్యక్రమం ప్రారంభించి వారికి వారి కుటుంబ సభ్యులకు ముత్యాలమ్మ దీవెనలు ఎల్లవేళలా ఉండాలని కోరిన ఇంద్ర పాలనగరం సర్పంచ్ గర్దాస్ విక్రమ్ ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ నల్ల జయసుధ స్వామి నాయకులు చిన్నపాక శ్రీనివాసులు బోనగిరి శ్రీనివాస్ శివగల నరేష్ బోళ్ల మచ్చ గిరి దగ్గుల వెంకటేష్ భువనగిరి మధు గర్దాస్ శ్రీకాంత్ ఎలిమినేటి నరేష్ మాదం నగేష్ నల్ల అనిల్ తదితరులు పాల్గొన్నారు.

# మానవత్వం చాటుకున్న ఆవుల రామకృష్ణ... 5000 ఆర్థిక సహాయం అందజేత




**తొలి అక్షరం/రామన్నపేట ఆగస్టు 9:** రామన్నపేట మండలం నీర్నంల గ్రామానికి చెందిన ముత్యాల శివ ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మరణించిన విషయాన్ని తెలుసుకున్న ఆవుల. రామకృష్ణ మానవత్వంతో ముత్యాల శివ కుటుంబ సభ్యులను పరామర్శించి మృతదేహానికి నివాళులు అర్పించి 5000 రూపాయల ఆర్థిక సహాయం అందించినారు.

# భారత్ ఇలా వికసించాలి..

దివారాత్రుల తక్కెడ లో సగటు మానవుల
బరువెక్కిన గుండెలు అను నిముషం
తూచబడు తున్నాయి

ఆర్థత నిండిన

కళ్ళల్లో రాత్రి పగళ్ల

తేడా లేకుండా చీకటి వెలుగులు
దోబూచులాడుతూ చిందులేస్తున్నాయి

జీవన ప్రయాణ ప్రమాణాల చీకటి కోణాలు
అనుక్షణం ఆదమరుపు పీడకలలాగా
కనురెప్పలను వీడకుండా కలవర
పెడుతుంటాయి

హృది అంతరాలలో బాధల బడబాగ్నులు

దాచుకొని

కృత్రిమ నవ్వును అప్పటికప్పుడు పెదాలపైకి
నగదుగా అరువు తెచ్చుకొని ఆనందిస్తాయి

బాధాతప్త హృదయాలు మేలి రంగుల
ముసుగును అడ్డుపెట్టికొని

స్వాభావిక

గంభీరతను ప్రదర్శిస్తాయి

ఆధునిక సంతోష విషాదాల మాయాసంతలలో
ఇరువైపులా విశ్వాస రహిత హృదయ
మారకాలు జరుగుతాయి

బ్రతుకు బండి చక్రాలు వృత్త సంచారులుగా
మారి విరామారామాలు ఎరుగక యజమానికి
కీలుబొమ్మలైనాయి

వారి లాభార్జనకై కార్మికుల చమట చుక్కలు

కార్పొరేటు కంపెనీ కడ గోడలను నిరంతరం
తడుపుతూనే ఉన్నాయి ఆధునిక యుగంలో
అట్టడుగు వర్గాలకు ఆకలి వాంఛలను
అదుపులో ఉంచుకోవడం కూడా ఫ్యాషన్
అయిపోయింది పరువులకు ఉన్న

విలువ తనువులకు లేకపోయింది

కుబేర కుటుంబ బీరువాల్లో సంపద
ముక్కిమూలుగుతున్నది

వేలాది ఎకరాల్లో కార్పొరేట్ నివాస వెంచర్లు
ఎదురు చూస్తున్నాయి

పేదల స్వంతింటి కలలు నేటికీ
ఎక్కిరిస్తున్నాయి

ఆకలి డొక్కలు కళ్ళ మాటున గుంబనంగా
ఎక్కివెక్కి ఏడుస్తున్నవి

బతుకు ఆయు ప్రమాణపు అంతరం
వయసుతో నిమిత్తం లేకుండా తొందరగానే
నిండు కుంటున్నది మరణించిన శ్రీమంతునికి

శ్రీదరిద్రునికి

మరణంలో

అంతరం ఏమీ లేదు

కానీ వారివి గొప్ప కాల్పనిక కట్టు కథల
నేపథ్య కీర్తి గాథల ప్రచారాలు..

వీరివి ఎట్టి పేదరికపు అడుగంటిన బతుకుల
కొసపెదాల తాత్కాలిక పుక్కిటి మాటలు
పరిశ్రమ ఎవరిదైనా శ్రమించే వారెవరైనా
రైతు,కార్మికులకు

శ్రమించేది ఏదైనా రావలసినంత

ఫలితం రావాలి జీవితాలు ఫలించాలి
పండించే ప్రతి గింజ, సృష్టించే ప్రతి
వస్తువులపై కష్టపడే రైతు కార్మికుల
వేలిముద్రలు పేటెంట్ హక్కులుగా మారాలి

అంతర్జాతీయ సంతలో శ్రమకు తగ్గ సరైన
మూల్యం రావాలి

అది చూసి భారతమ్మ ఆపాద మస్తకమ్
ఆనంద పడాలి

అప్పుడే

వికసిత్ భారత్ అవుతుంది...

– పప్పుల, వెంకన్న ఇనుగుర్తి సెల్
9347125338.



# 'నిర్మల్ హృదయ' విద్యా శిఖరం నేలరాలింది

**- 'నిర్మల హృదయుడు' సాంబశివరెడ్డికి కన్నీటి వీడ్కోలు**

**- వేలాది మందికి విద్యాదానం చేసిన మహనీయుడికి మూమెంట్ ఫర్ పీస్ అండ్ జస్టిస్ (ఎంపీజే) ప్రగాఢ సంతాపం..**

**- భౌతికకాయానికి నివాళులర్పించిన జిల్లా అధ్యక్షులు షేక్ ఖాసీం**



**తొలి అక్షరం/ఖమ్మం ఆగస్టు 9:** అక్షర జ్ఞానాన్ని పంచుతూ, వేలాది మంది విద్యార్థుల భవితకు బాటలు వేసిన విద్యాదాత, ఖమ్మం నగరంలోని ప్రతిష్ఠాత్మక 'నిర్మల హృదయ' విద్యా సంస్థల అధినేత వంగా సాంబశివరెడ్డి గుండెపోటుతో ఆకస్మికంగా మృతి చెందడం నగరంలో తీవ్ర విషాదాన్ని నింపింది. ఆయన మరణవార్త పట్ల మూమెంట్ ఫర్ పీస్ అండ్ జస్టిస్ (ఎంపిజే) జిల్లా అధ్యక్షులు షేక్ ఖాసీం తీవ్ర దిగ్భ్రాంతిని, ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తం చేశారు. ఖమ్మంలోని సాంబశివరెడ్డి స్వగృహానికి ఆదివారం చేరుకున్న ఆయన.. ఆ మహనీయుడి భౌతికకాయాన్ని సందర్శించి, కన్నీటి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు షేక్ ఖాసిం మాట్లాడుతూ.. సాంబశివరెడ్డి కేవలం ఒక పాఠశాలకు కరస్పాండెంట్ మాత్రమే కాదని, ఎంతో మందికి జీవిత మార్గదర్శి అని గుర్తుచేసుకున్నారు. అలుపెరగని కృషితో విద్యా రంగానికి ఆయన అందించిన నిస్వార్థ సేవలు చరిత్రలో చిరస్మరణీయంగా నిలిచిపోతాయన్నారు. కేవలం అక్షరాలు నేర్పించడమే కాకుండా, విద్యార్థులను ఉన్నత నైతిక విలువలు, మానవత్వం కలిగిన ఉత్తమ భావిభారత పౌరులుగా తీర్చిదిద్దడంలో సాంబశివరెడ్డి చూపిన చొరవ, అంకితభావం ప్రతి ఒక్కరికీ ఆదర్శనీయమని కొనియాడారు. ఆయన ఆకస్మిక మరణం విద్యా రంగానికి ఎన్నటికీ పూడ్చలేని లోటని, ఆయన రగిలించిన విద్యా స్ఫూర్తి భవిష్యత్ తరాలకు దారిచూపుతుందని ఉద్వేగంగా పేర్కొన్నారు. ఈ కష్ట సమయంలో ఆయన కుటుంబ సభ్యులకు మనోధైర్యాన్ని ప్రసాదించాలని వారు ఆకాంక్షించారు. సాంబ శివరెడ్డి భౌతికకాయానికి నివాళులర్పించిన వారిలో ఎంపిజే జిల్లా కోశాధికారి ఎండి. హకీమ్, సీనియర్ సభ్యులు అంజద్ పాషా తదితరులు ఉన్నారు.

# మదనపల్లిలో ఘనంగా ప్రపంచ ఆదివాసి దినోత్సవం




**తొలి అక్షరం/మదనపల్లి, ఆగస్టు 9 :** ఆంధ్రప్రదేశ్ గిరిజన యానాది సేవా సంఘం ఆధ్వర్యంలో మదనపల్లి పట్టణంలో ప్రపంచ ఆదివాసి దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గడ్డం శ్రీనివాసులు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి అన్నమయ్య, చిత్తూరు, శ్రీ సత్యసాయి జిల్లాల నుంచి పెద్ద సంఖ్యలో గిరిజన యానాదులు తరలివచ్చారు. ప్రపంచ ఆదివాసి దినోత్సవాన్ని పురస్కరించుకుని ముందుగా స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుంచి గిరిజన యానాదులు భారీ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో గిరిజనుల హక్కులు, సంక్షేమం, అభివృద్ధికి సంబంధించిన నినాదాలు చేస్తూ పట్టణంలోని ప్రధాన వీధుల గుండా ముందుకు సాగారు. అనంతరం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహం వద్దకు చేరుకుని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అంబేద్కర్ ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని గిరిజనుల హక్కుల సాధన కోసం ఐక్యంగా కృషి చేయాలని ఈ సందర్భంగా నాయకులు పిలుపునిచ్చారు. అనంతరం ర్యాలీ తిరిగి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చేరుకుంది. అక్కడి సమావేశ భవనంలో ప్రపంచ ఆదివాసి దినోత్సవ సభను నిర్వహించారు. ఈ సమావేశానికి సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గడ్డం శ్రీనివాసులు అధ్యక్షత వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఆంధ్రప్రదేశ్ గిరిజన యానాది సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షులు పులి శ్రీనివాసులు, సంఘం గౌరవ అధ్యక్షులు జానం గంగిరెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గిరిజనుల సామాజిక, ఆర్థిక, విద్యా, ఉపాధి రంగాల్లో సమగ్ర అభివృద్ధి సాధించేందుకు ప్రభుత్వాలు మరింత దృష్టి సారించాల్సిన అవసరం ఉందన్నారు. గిరిజనుల సంక్షేమానికి అందుబాటులో ఉన్న ప్రభుత్వ పథకాలు, హక్కులు ప్రతి కుటుంబానికి చేరేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రపంచ ఆదివాసి దినోత్సవం కేవలం వేడుకలకు మాత్రమే పరిమితం కాకుండా ఆదివాసీల హక్కులు, సంస్కృతి, సంప్రదాయాలు, జీవన విధానం, సహజ వనరులపై వారి హక్కుల పరిరక్షణకు సంబంధించిన అంశాలను గుర్తుచేసే ముఖ్యమైన రోజని వారు పేర్కొన్నారు. గిరిజన సమాజం ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారానికి సంఘటితంగా పోరాడాల్సిన అవసరం ఉందన్నారు. గడ్డం శ్రీనివాసులు మాట్లాడుతూ, యానాది గిరిజనుల అభివృద్ధికి విద్య అత్యంత కీలకమని పేర్కొన్నారు. ప్రతి గిరిజన కుటుంబం తమ పిల్లలను చదివించి ఉన్నత విద్య వైపు ప్రోత్సహించాలని సూచించారు. గిరిజనులకు అందాల్సిన సంక్షేమ పథకాలు, విద్యా అవకాశాలు, ఉపాధి అవకాశాలు పూర్తిస్థాయిలో అందేలా సంఘం నిరంతరం కృషి చేస్తుందని తెలిపారు. యానాది సమాజం ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి వాటి పరిష్కారం కోసం ప్రభుత్వ యంత్రాంగంతో సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగుతామని చెప్పారు. గిరిజనుల అభివృద్ధితో పాటు వారి సంప్రదాయాలు, సంస్కృతి, ఆచార వ్యవహారాలను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. గిరిజన సమాజంలో ఐక్యతను పెంపొందించుకుని హక్కుల సాధన కోసం కలిసికట్టుగా పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అన్నమయ్య, చిత్తూరు, శ్రీ సత్యసాయి జిల్లాలకు చెందిన గిరిజన యానాదులు భారీ సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. దీంతో మదనపల్లి పట్టణంలో ప్రపంచ ఆదివాసి దినోత్సవ వేడుకలు ఉత్సాహభరిత వాతావరణంలో జరిగాయి. కార్యక్రమంలో సంఘ జిల్లా మహిళా నాయకురాలు నారాయణమ్మ, సంఘ నాయకులు టేకుమంద రెడ్డప్ప, చుక్కలపాటి ఆదినారాయణ,తదితరులు పాల్గొన్నారు.

## విజయ్ సేతుపతి స్లమ్ డాగ్ నుంచి అదిరిపోయే అప్డేట్ ఇంటెన్స్ లుక్‌లో టబు

కోలీవుడ్ వెర్సటైల్ యాక్టర్ మక్కల్ సెల్వన్ విజయ్ సేతుపతి, టాలీవుడ్ డాషింగ్ డైరెక్టర్ పూరి జగన్నాథ్ కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న యాక్షన్ ఎంటర్‌టైనర్ 'స్లమ్ డాగ్'పై మరోసారి ఆసక్తి పెరుగుతోంది. ఈ ప్రాజెక్ట్ ప్రకటించిన సమయంలోనే విజయ్ సేతుపతి, పూరి జగన్నాథ్ కాంబినేషన్ కావడంతో ప్రేక్షకుల్లో భారీ అంచనాలు ఏర్పడ్డాయి. అయితే సినిమా నిర్మాణం అనుకున్న దానికంటే ఎక్కువ సమయం తీసుకోవడంతో విడుదల ఆలస్యమవుతూ వచ్చింది. కొంతకాలం పాటు చిత్రబృందం నుంచి ఎలాంటి అప్‌డేట్స్ లేకపోవడంతో సినిమాపై చర్చ కూడా తగ్గిపోయింది. తాజాగా మేకర్స్ మళ్లీ ప్రమోషన్ మొదలు పెట్టడంతో 'స్లమ్ డాగ్' మరోసారి వార్తల్లో నిలుస్తోంది. ఈ సినిమా నుంచి తాజాగా సీనియర్ నటి టబుకు సంబంధించిన ఫస్ట్ లుక్‌ను చిత్రబృందం విడుదల చేసింది. ఇంటెన్స్ లుక్‌లో కనిపిస్తున్న టబును 'గౌరి హెగ్డే' అనే పాత్రలో పరిచయం చేశారు. పోస్టర్‌ను పరిశీలిస్తే టబు పాత్ర సినిమాకు చాలా కీలకంగా ఉండబోతుందనే ఆసక్తి కలుగుతోంది. ఆమె పాత్ర స్వభావం, కథలో ఎలాంటి మలుపులు తీసుకురాబోతుందనే విషయాలను మాత్రం మేకర్స్ ప్రస్తుతానికి సీక్రెట్‌గా ఉంచారు. అంతేకాదు.. టబు పాత్రకు సంబంధించిన గ్లింప్స్‌ను ఆగస్టు 10న ఉదయం 11 గంటలకు విడుదల చేయనున్నట్లు చిత్రబృందం అధికారికంగా ప్రకటించింది. దీంతో ఈ గ్లింప్స్‌పై ప్రేక్షకుల్లో ఆసక్తి పెరిగింది. విజయ్ సేతుపతి, పూరి జగన్నాథ్ కాంబినేషన్‌లో వస్తున్న ఈ చిత్రం సాలిడ్ యాక్షన్ బ్యాక్‌డ్రాప్‌లో తెరకెక్కుతున్నట్లు తెలుస్తోంది. పూరి జగన్నాథ్ సినిమాల్లో కనిపించే మాస్ ఎలిమెంట్స్‌కు విజయ్ సేతుపతి నటన తోడవడంతో ఈ ప్రాజెక్ట్‌పై మొదటి నుంచే మంచి బజ్ ఉంది. ఈ సినిమాను జేబీ మోషన్ పిక్చర్స్, ఛార్మి సంయుక్తంగా నిర్మిస్తున్నారు. పాన్ ఇండియా స్థాయిలో సినిమాను విడుదల చేసేందుకు మేకర్స్ సన్నాహాలు చేస్తున్నారు. ఇప్పటివరకు ఆలస్యం కారణంగా సైలెంట్‌గా ఉన్న 'స్లమ్ డాగ్' నుంచి వరుస అప్‌డేట్స్ రాబోతున్నట్లు తెలుస్తోంది. టబు గ్లింప్స్‌తో మొదలైన ఈ కొత్త ప్రమోషన్ క్యాంపెయిన్.. రాబోయే రోజుల్లో మరిన్ని ఆసక్తికరమైన అప్డేట్స్‌తో సినిమాపై హైప్‌ను పెంచే అవకాశం ఉంది.




## ఓటీటీలోకి స్పైడర్ మ్యాన్ బ్రాండ్ న్యూ డే రూ.12 వేల కోట్ల వసూళ్లతో దూసుకెళ్తున్న మూవీ స్ట్రీమింగ్ ఎప్పుడంటే

మార్వెల్ సినిమాటిక్ యూనివర్స్ సోనీ పిక్చర్స్ కాంబినేషన్‌లో టామ్ హాలండ్ హీరోగా తెరకెక్కిన మోస్ట్ అవైటెడ్ సూపర్ హీరో మూవీ 'స్పైడర్ మ్యాన్: బ్రాండ్ న్యూ డే' బాక్సాఫీస్ వద్ద సంచలనం సృష్టిస్తోంది. భారీ అంచనాల మధ్య విడుదలైన ఈ సినిమా ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకులను ఆకట్టుకుంటూ వసూళ్ల వర్షం కురిపిస్తోంది. ముఖ్యంగా భారతదేశంలోనూ స్పైడర్ మ్యాన్‌కు ఉన్న క్రేజ్ మరో సారి స్పష్టమైంది. భారత్‌లో ఐమాక్స్ స్క్రీన్లు అందుబాటులో లేకపోయినప్పటికీ 'స్పైడర్ మ్యాన్: బ్రాండ్ న్యూ డే' తొలి మూడు రోజుల్లోనే సుమారు రూ.309 కోట్ల గ్రాస్ వసూళ్లు సాధించినట్లు సమాచారం. దీంతో ఇండియన్ బాక్సాఫీస్ వద్ద ఈ సినిమా కొత్త రికార్డులు నమోదు చేస్తోంది. ఇక అంతర్జాతీయ మార్కెట్‌లోనూ స్పైడీ దూకుడు కొనసాగుతోంది. విడుదలైన వారం రోజులు పూర్తికాకముందే ఈ చిత్రం 1 బిలియన్ డాలర్ల గ్రాస్ మార్క్‌ను అందుకున్నట్లు తెలుస్తోంది. 'అవెంజర్స్: ఎండ్‌గేమ్' తర్వాత ఇంత వేగంగా ఈ మైలురాయిని చేరుకున్న చిత్రాల్లో ఇదొకటిగా నిలిచింది. ప్రస్తుతం ఈ సినిమా ప్రపంచవ్యాప్తంగా రూ.12 వేల కోట్లకు పైగా గ్రాస్ వసూళ్లు సాధించినట్లు సమాచారం. ఇదే జోరు కొనసాగితే త్వరలోనే 2 బిలియన్ డాలర్ల క్లబ్‌లోకి కూడా అడుగుపెట్టే అవకాశం ఉందని ట్రేడ్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. థియేటర్లలో రికార్డు స్థాయి వసూళ్లతో దూసుకెళ్తున్న 'బ్రాండ్ న్యూ డే' ఓటీటీ రిలీజ్‌పై కూడా ప్రేక్షకుల్లో ఆసక్తి పెరిగింది. తాజా సమాచారం ప్రకారం ఈ సినిమా సెప్టెంబర్ చివరి వారంలో లేదా అక్టోబర్ 2026లో డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లోకి వచ్చే అవకాశం ఉందని తెలుస్తోంది. అయితే, థియేట్రికల్ రన్ ఎంతకాలం కొనసాగుతుందనే దానిపై ఓటీటీ విడుదల తేదీ ఆధారపడి ఉంటుంది. ప్రస్తుతం సినిమా భారీ వసూళ్లు సాధిస్తున్న నేపథ్యంలో డిజిటల్ రిలీజ్‌ను కొంత ఆలస్యం చేసే అవకాశం కూడా ఉందనే ప్రచారం జరుగుతోంది. సోనీ పిక్చర్స్‌కు సంబంధించిన గ్లోబల్ డిజిటల్ డీల్ ప్రకారం ఈ సినిమా థియేట్రికల్ రన్ పూర్తైన తర్వాత నెట్‌ఫ్లిక్స్‌లోకి వచ్చే అవకాశం ఉందనే టాక్ వినిపిస్తోంది. అయితే భారతదేశానికి సంబంధించిన డిజిటల్ స్ట్రీమింగ్ విషయంలో మాత్రం పరిస్థితి కొంత భిన్నంగా ఉండొచ్చని తెలుస్తోంది. ప్రస్తుతం ఇండియాలో మార్వెల్‌కు సంబంధించిన పలు సినిమాలు, ముఖ్యంగా వీజఖ కంటెంట్ జియోహాట్‌స్టార్‌లో అందుబాటులో ఉంది. 'స్పైడర్ మ్యాన్: నో వే హోమ్' కూడా అక్కడే స్ట్రీమింగ్ అవుతోంది. దీంతో 'బ్రాండ్ న్యూ డే' కూడా భారతీయ ప్రేక్షకుల కోసం జియోహాట్‌స్టార్‌లోకి వచ్చే అవకాశాలను కొట్టిపారేయలేమనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

అయితే నెట్‌ఫ్లిక్స్, జియో హాట్‌స్టార్‌లో ఏ ప్లాట్‌ఫామ్ ఈ సినిమా డిజిటల్ హక్కులను దక్కించుకుంటుందనే విషయంపై అధికారిక ప్రకటన రావాల్సి ఉంది.



## మహేశ్‌బాబు పుట్టినరోజు వేళ శుభాకాంక్షల వెల్లువ చిరంజీవి పవన్ వెంకటేష్ ప్రత్యేక విషెస్

టాలీవుడ్ సూపర్‌స్టార్ మహేశ్‌బాబు పుట్టినరోజు సందర్భంగా సోషల్ మీడియా మొత్తం శుభాకాంక్షలతో హోరెత్తుతోంది. ఆగస్టు 9న మహేశ్‌బాబు జన్మదినాన్ని పురస్కరించుకుని సినీ ప్రముఖులు, అభిమానులు ఆయనకు ప్రత్యేకంగా విషెస్ చెబుతున్నారు. మహేశ్ సినీ ప్రయాణం, సేవా కార్యక్రమాలను గుర్తు చేసుకుంటూ పలువురు స్టార్ హీరోలు ఆయనపై తమ అభిమానాన్ని చాటుకున్నారు. మెగాస్టార్ చిరంజీవి మహేశ్‌బాబుకు ప్రత్యేకంగా పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. మహేశ్ ఎదుగుదలను ఎన్నో ఏళ్లుగా చూస్తూ రావడం తనకు ఎంతో ఆనందాన్ని ఇస్తోందని చిరంజీవి పేర్కొన్నారు. భారతీయ సినిమాలో అత్యంత ప్రేమాభిమానాలు పొందుతున్న ప్రముఖ నటుల్లో ఒకరిగా మహేశ్ ఎదగడం గర్వంగా ఉందని అన్నారు. భగవంతుడు ఎల్లప్పుడూ మహేశ్‌ను ఆశీర్వదించాలని కోరుకుంటున్నట్లు చిరంజీవి తెలిపారు. మరోవైపు మహేశ్‌బాబుకు శుభాకాంక్షలు చెబుతూ పవన్ కళ్యాణ్ క్రియేటివ్ వర్క్స్ కూడా ప్రత్యేక సందేశాన్ని పంచుకుంది. సూపర్‌స్టార్ మహేశ్‌బాబుకు హృదయపూర్వక పుట్టినరోజు శుభాకాంక్షలు తెలుపుతూ.. ఆయనకు మంచి ఆరోగ్యం, సంతోషం, మరెన్నో విజయాలు దక్కాలని ఆకాంక్షించింది. ముఖ్యంగా మహేశ్ బాబు చేస్తున్న సేవా కార్యక్రమాలను ఈ సందర్భంగా ప్రశంసించారు. చిన్నారులకు సహాయం చేయడంలో ఆయన చూపిస్తున్న నిబద్ధత, మానవతా దృక్పథం ఎంతోమందికి స్ఫూర్తిగా నిలుస్తోందని పేర్కొన్నారు. విక్టరీ వెంకటేష్ కూడా తనదైన శైలిలో మహేశ్ బాబుకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. 'నా చిన్నోడు మహేష్' అంటూ ఆప్యాయంగా సంబోధించిన వెంకటేష్.. మహేశ్ జీవితంలో ఎల్లప్పుడూ ప్రేమ, నవ్వులు నిండాలని ఆకాంక్షించారు. అంతేకాదు, మహేశ్ నటిస్తున్న 'వారణాసి'పై కూడా వెంకటేష్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఈ సినిమాలో రుద్ర పాత్రలో మహేశ్ రగ్గడ్‌గా, హ్యాండ్సమ్‌గా కనిపిస్తున్నాడని ప్రశంసించారు. వచ్చే ఏడాది 'వారణాసి'తో మహేశ్ ప్రపంచాన్ని ఏలబోతున్నాడని పేర్కొంటూ.. ఆ సినిమాను చూసేందుకు తాను ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నానని తెలిపారు. మహేశ్‌బాబు ప్రస్తుతం దర్శకధీరుడు ఎస్ఎస్ రాజమౌళి తెరకెక్కిస్తున్న భారీ ప్రాజెక్ట్ 'వారణాసి'లో నటిస్తున్నారు. ఈ సినిమాకు సంబంధించిన మహేశ్ లుక్స్ ఇప్పటికే అభిమానుల్లో భారీ హైప్‌ను క్రియేట్ చేశాయి. రుద్ర పాత్రలో మహేశ్ కనిపించిన తీరు సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఇక మహేశ్‌బాబు పుట్టినరోజు సందర్భంగా అభిమానులు కూడా భారీ ఎత్తున సెలబ్రేషన్స్ నిర్వహిస్తున్నారు. థియేటర్లలో ఆయన పాత సినిమాల రీ-రిలీజ్‌లు, ప్రత్యేక కార్యక్రమాలు, సోషల్ మీడియాలో ట్రెండ్స్‌తో సూపర్‌స్టార్ బర్త్‌డేను ఘనంగా జరుపుకుంటున్నారు.



## వైజాగ్ సినీ ప్రియులకు గుడ్ న్యూస్

### విశాఖలో ఏఏఏ సినిమాస్'ని ఘనంగా ప్రారంభించిన అల్లు అర్జున్



టాలీవుడ్ ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ తన థియేటర్ల వ్యాపారాన్ని మరింత విస్తరిస్తూ, ఆంధ్రప్రదేశ్‌లోని ప్రముఖ నగరమైన విశాఖపట్నంలో అత్యాధునిక హంగులతో కూడిన 'ఏఏఏ సినిమాస్' మల్టీప్లెక్స్‌ను ప్రారంభించారు. వైజాగ్‌లోని ఇనార్బిట్ మాల్ వేదికగా ఏర్పాటు చేసిన ఈ అత్యాధునిక థియేటర్ ప్రారంభోత్సవ కార్యక్రమం అత్యంత వైభవంగా జరిగింది. ఏషియన్ సినిమాస్ తో కలిసి అల్లు అర్జున్ ఈ ప్రాజెక్ట్‌ను ముందుకు తీసుకువెళున్నారు. ఈ మల్టీప్లెక్స్ విశాఖ సినీ ప్రియులకు ఒక సరికొత్త మరియు ప్రపంచస్థాయి సినిమా అనుభూతిని అందించనుంది.

ఇది ఆంధ్రప్రదేశ్లోనే అతిపెద్ద ఎల్ఈడీ సినిమా స్క్రీన్ అని తెలుస్తుంది. భారత దేశం లోనే మొట్టమొదటి ఎల్ఈడీ ప్రొజెక్షన్ క్యూ-లక్సన్ స్క్రీన్‌ను ఇందులో అమర్చారు. మొత్తం 8 స్క్రీన్లతో, 1,556 సీటింగ్ సామర్థ్యంతో పాటు విఐపి అతిథుల కోసం ప్రత్యేకంగా 'ఐకాన్ స్టార్ లాంజ్' మరియు '82 లాంజ్'లను ఏర్పాటు చేశారు.


## అల్లరి నరేష్ కొత్త సినిమా రంభ ఊర్వశి మేనక టీజర్ డేట్ ఫిక్స్




టాలీవుడ్ కామెడీ కింగ్ అల్లరి నరేష్ తన సిగ్నేచర్ కామెడీ జోనర్‌తో మరోసారి ప్రేక్షకులను కడుపుబ్బా నవ్వించడానికి సిద్ధమయ్యారు. ఆయన నటిస్తున్న తాజా చిత్రం 'రంభ ఊర్వశి మేనక' ఈ చిత్రం నుంచి మేకర్స్ తాజాగా ఒక క్రేజీ అప్‌డేట్‌ను విడుదల చేశారు. ఈ సినిమా నుంచి ఆగష్టు 11న టీజర్ విడుదల చేయబోతున్నట్లు ప్రకటించారు. టీజర్ డేట్‌లో మాత్రమే చిన్న సర్దుబాటు... ఎంటర్‌టైన్‌మెంట్‌లో మాత్రం ఎలాంటి సర్దుబాట్లు ఉండవు" అంటూ చిత్ర యూనిట్ ఈ సినిమాపై అంచనాలను మరింత పెంచేసింది. ఈ చిత్రానికి సంబంధించిన మోస్ట్ అవేటెడ్ టీజర్ ఆగష్టు 11న గ్రాండ్‌గా లాంచ్ కానుంది. అల్లరి నరేష్ పాత కామెడీ టైమింగ్‌ను గుర్తుచేసేలా ఈ సినిమా ఉండబోతుందని పోస్టర్లు చూస్తేనే అర్థమవుతోంది.

ఈ చిత్రంలో అల్లరి నరేష్ సరసన సురభి హీరోయిన్‌గా నటిస్తుండగా, చంద్రమోహన్ దర్శకత్వం వహిస్తున్నారు. హాస్య మూవీస్ మరియు అన్నపూర్ణ స్టూడియోస్ పతాకాలపై రాజేష్ దండా, లెమన్ ప్రసాద్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. శ్రీచరణ్ పాకాల సంగీతం అందిస్తున్న ఈ సినిమాపై ప్రేక్షకుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. అల్లరి నరేష్ మార్క్ ఫుల్-ఆన్ ఎంటర్‌టైన్‌మెంట్‌తో రాబోతున్న ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా సెప్టెంబర్ 4, 2026న ఘనంగా విడుదల కానుంది. థియేటర్లలో నవ్వుల వర్షం కురిపించేందుకు రెడీ అవుతున్న ఈ సినిమా టీజర్ కోసం అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

## వీసా కారణంగా సిడ్నీ స్టేజ్ షో రద్దు అభిమానులకు క్షమాపణలు చెప్పిన మోహన్ లాల్



ఆస్ట్రేలియాలోని సిడ్నీ వేదికగా జరగాల్సిన తన లైవ్ స్టేజ్ షో వీసా సమస్య కారణంగా వాయిదా పడటంతో మలయాళ సూపర్ స్టార్ మోహన్ లాల్ తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఊహించని పరిణామం పట్ల ఆయన అభిమానులకు, నిర్వాహకులకు క్షమాపణలు చెబుతూ సింగపూర్ నుండి ఒక వీడియో సందేశాన్ని విడుదల చేశారు. తన 50 ఏళ్ల సినీ కెరీర్‌లో ఇలాంటి పరిస్థితి ఎదురు కావడం ఇదే మొదటిసారి అని ఆయన పేర్కొన్నారు. సింగపూర్ లో ఉన్న తనకు ఆస్ట్రేలియా వీసా సమయానికి రాకపోవడం వల్లనే తాను సిడ్నీ వెళ్లలేకపోయానని, అయితే సింగర్ కేఎస్ చిత్రతో సహ మిగతా బృందమంతా ఇప్పటికే సిడ్నీ చేరుకున్నారని ఆయన తెలిపారు. ఇది టెక్నికల్ లేదా క్లెరికల్ పొరపాటు కావచ్చని, దీనికి ఎవరిని తాను బ్లేమ్ చేయదలచుకోలేదని, ఈ తప్పు పూర్తిగా తనదే నంటూ మొత్తం బాధ్యతను తానే మోస్తున్నట్లు మోహన్ లాల్ స్పష్టం చేశారు. ఈ ప్రదర్శన కోసం చాలా దూరం నుండి డ్రైవ్ చేసుకుని వచ్చిన ప్రేక్షకులకు హృదయపూర్వక క్షమాపణలు తెలుపుతున్నానని, తాను పూర్తిగా అసహాయ స్థితిలో ఉన్నానని ఆయన భావోద్వేగానికి గురయ్యారు. త్వరలోనే అదే టీమ్‌తో మళ్లీ సిడ్నీకి వచ్చి అద్భుతమైన షోను నిర్వహిస్తామని ఆయన అభిమానులకు గట్టి హామీ ఇచ్చారు.

## వెండితెరను వణికించేందుకు రాబోతున్న మీర్జాపూర్ ట్రైలర్ వచ్చేది ఆరోజే

భారతీయ ఓటీటీ చరిత్రలో సరికొత్త సంచలనాలు సృష్టించి, ప్రేక్షకులను విపరీతంగా అలరించిన మోస్ట్ పాపులర్ క్రైమ్ థ్రిల్లర్ ఫ్రాంచైజీ 'మీర్జాపూర్' ఇప్పుడు బిగ్ స్క్రీన్ పైకి దూసుకొస్తోంది. ఓటీటీ నుంచి నేరుగా వెండితెరపైకి అడుగుపెడుతున్న ఈ భారీ చిత్రం 'మీర్జాపూర్: ది మూవీ' కోసం దేశవ్యాప్తంగా ఉన్న సినీ ప్రియులు ఎంతగానో ఎదురుచూస్తున్నారుకాగా, సినిమాపై అంచనాలను తారాస్థాయికి తీసుకువెళ్లేందుకు మేకర్స్ తాజాగా ఒక క్రేజీ అప్‌డేట్‌ను అనౌన్స్ చేశారు. ఈ చిత్రానికి సంబంధించిన మోస్ట్ అవేటెడ్ ట్రైలర్‌ను ఆగష్టు 11న గ్రాండ్‌గా విడుదల చేయబోతున్నట్లు ప్రకటించారు. విడుదల తేదీ దగ్గర పడుతుండటంతో సోషల్ మీడియాలో అభిమానుల ఉత్సాహం తారస్థాయికి చేరింది. కాలీన్ భయ్యా (పంకజ్ త్రిపాఠి), గుడ్డు పండిట్ (అలీ ఫజల్) మరియు అందరితో పాటు ప్రత్యేక ఆకర్షణగా నిలిచే మున్నా భయ్యా (దివ్యేందు) వంటి ఐకనిక్ పాత్రలతో ఈ సినిమా తెరకెక్కుతోంది. కేవలం డిజిటల్ స్క్రీన్‌లకే పరిమితం కాకుండా, ఈసారి ఏకంగా వెండితెరపై పవర్-ప్యాక్డ్ యాక్షన్‌తోకానుంది.

## కొరియన్ కనకరాజు దూకుడు కొడుకు సినిమా హిట్‌పై నాగబాబు ఎమోషనల్ ట్వీట్

మెగా ప్రిన్స్ వరుణ్ తేజ్ హీరోగా మేర్లపాక గాంధీ దర్శకత్వంలో తెరకెక్కిన హారర్ కామెడీ ఎంటర్‌టైనర్ 'కొరియన్ కనకరాజు' బాక్సాఫీస్ వద్ద జోరు చూపిస్తోంది. రాయలసీమ నేటివిటీకి కొరియన్ కల్చర్‌ను జోడించి తెరకెక్కించిన ఈ విభిన్నమైన కథ ప్రేక్షకులను ఆకట్టుకుంటోంది. ఆగస్టు 7న థియేటర్లలోకి వచ్చిన ఈ సినిమాకు తొలి షో నుంచే మంచి స్పందన రావడంతో కలెక్షన్ల పరంగా కూడా దూసుకెళ్తోంది. ఈ చిత్రంలో వరుణ్ తేజ్ సరసన రితికా నాయక్ హీరోయిన్‌గా నటించగా.. సత్య తన కామెడీ టైమింగ్‌తో ప్రేక్షకులను కడుపుబ్బా నవ్విస్తున్నారు. అనంతపురం జిల్లా పెనుగొండ నేపథ్యంలో సాగే ఈ కథలో కనకరాజు అనే పల్లెటూరి యువకుడిని ఓ కొరియన్ ఆత్మ ఆవహిస్తుంది. ఆ తర్వాత అతడి జీవితంలో చోటుచేసుకునే విచిత్రమైన పరిణామాలు, కామెడీ సన్నివేశాలు సినిమాకు ప్రధాన ఆకర్షణగా నిలుస్తున్నాయి. 'కొరియన్ కనకరాజు' విడుదలైన తొలి రోజే దాదాపు రూ.10.2 కోట్ల గ్రాస్ వసూళ్లు సాధించినట్లు ట్రేడ్ వర్గాలు చెబుతున్నాయి. మంచి ఆక్యుపెన్సీతో కొనసాగింది.